

## వైభవ్ విస్ఫోటం..

ముక్కోణపు వన్డే సిరీస్‌లో యువ భారత్ జయకేతనం ఎగురవేసింది. అన్నింటా ఆధిపత్యం ప్రదర్శించిన కుర్రాళ్లు శ్రీలంక గడ్డపై సింహనాదం చేశారు. టోర్నీలో పేలవ ఫామ్‌తో విమర్శలకు గురైన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ టైటిల్ పోరులో ఆకాశమే హద్దుగా చెలరేగిన వేళ భారత్ 'ఏ' ట్రోఫీని సగర్వంగా ముద్దాడింది. ఆదివారం జరిగిన ఫైనల్లో హైదరాబాదీ తిలక్‌వర్మ సారథ్యంలోని భారత్ 'ఏ' 66 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. చిచ్చరపిడుగు సూర్యవంశీ(29 బంతుల్లో 94, 10ఫోర్లు, 8సిక్స్‌లు) వీరవిహారానికి తోడు కెప్టెన్ తిలక్‌వర్మ(90 బంతుల్లో 67, 4ఫోర్లు, సిక్స్) అర్ధసెంచరీతో భారత్ 'ఏ' 50 ఓవర్లలో 377-9 భారీ స్కోరు చేసింది. లంక బౌలర్లను ఊచకోత కోస్తూ సూర్యవంశీ కేవలం 11 బంతుల్లోనే అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు.


# చట్టం

సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

నిజామాబాద్
సోమవారం
22.06.2026

సంపుటి : 16 సంచిక: 267
పేజీలు:8 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్


# నాకు ఎవరి సీటూ వద్దు

## తెలంగాణ రాజ్యసభపై ఆసక్తి లేదు, నా రాజకీయం మధ్యప్రదేశ్‌లోనే

- నామినేషన్ తిరస్కరణ వెనుక బీజేపీ 'ఫౌల్ గేమ్' ఉంది
- ఈసీఐ , అధికారులు బీజేపీతో కుమ్మక్కయ్యారు
- నాపై క్రిమినల్ కేసులు లేవు, కేవలం పాత నోటీసు మాత్రమే
- చార్జ్ షీట్ లేకున్నా టికెట్ నిరాకరించడం తప్పు
- బీజేపీ 'సీట్ల చోరీ' చేస్తుందన్న రాహుల్ మాట నిజం



**చట్టం, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు మీనాక్షి నటరాజన్ పేరు మారుమోగుతోంది. రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని ఆమె స్వయంగా బయటపెట్టారు. తనకు ఎవరూ సీటు త్యాగం చేయలేదని, అసలు అలాంటి అవసరమే లేదని ఆమె స్పష్టం చేశారు. తన రాజకీయ ప్రస్థానం మధ్యప్రదేశ్‌కే పరిమితమని, తెలంగాణలో ఏదో జరుగుతోందని వస్తున్న వార్తలన్నీ కేవలం పుకార్లేనని ఆమె కొట్టిపారేశారు. ఆదివారం గాంధీ భవన్‌లో జరిగిన ఓబీసీ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని, కార్యకర్తలలో ఉన్న అయోమయాన్ని పటాపంచలు చేశారు. తనపై జరుగుతున్న విష ప్రచారంపై ఆమె ఫైర్ అయ్యారు. రాజకీయాల్లో ఎత్తుకు పై ఎత్తులు వేయడం సహజమే అయినా, అడ్డదారులు తొక్కడం ఎంతమాత్రం సమంజసం కాదని ఆమె అభిప్రాయపడ్డారు. పార్టీ అంతర్గతంగా ఎటువంటి కుట్రలు లేవని ఆమె క్లారిటీ ఇచ్చారు. రాజ్యసభ అంశం ఇప్పుడు కోర్టు పరిధిలో ఉన్నందున తాను మౌనంగా ఉన్నానని ఆమె వివరించారు. మధ్యప్రదేశ్‌లో మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా, ఒక్కో స్థానానికి యాభై ఎనిమిది మంది ఎమ్మెల్యేల ఓట్లు అవసరమవుతాయి. కాంగ్రెస్‌కు ఉన్న సంఖ్యాబలం ఆధారంగానే తనకు టికెట్ కేటాయించారని ఆమె గుర్తు చేశారు. అయితే బీజేపీకి మూడవ స్థానాన్ని గెలుచుకునే అవకాశం లేకపోయినా, కావాలనే నామినేషన్ వేసి గందరగోళం సృష్టించిందని ఆమె తీవ్రంగా విమర్శించారు. అధికారం ఉందని అడ్డదారిలో నెగ్గాలని చూడటం దుర్మార్గమని ఆమె వ్యాఖ్యానించారు. బీజేపీ అనుసరించిన ఫౌల్ గేమ్ ప్లాన్ వల్లనే ఈ మొత్తం గందరగోళం ఏర్పడిందని ఆమె ఆరోపించారు. ప్రత్యర్థులను బెదిరించడం లేదా డబ్బు ఆశ చూపడం వంటి నీచమైన రాజకీయాలకు బీజేపీ పాల్పడుతోందని ఆమె విమర్శించారు. తన నామినేషన్ విషయంలో రిటర్నింగ్ అధికారులు బీజేపీతో ఒప్పందం చేసుకున్నారని, ఎన్నికల సంఘం కూడా వారికి అనుకూలంగా వ్యవహరించిందని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో తమపై తప్పుడు కేసులు వేయడం లేదా కోర్టులో కేసులు ఫైల్ చేయడం వంటి చర్యలకు కూడా ఆ పార్టీ వెనుకాడదని ఆమె హెచ్చరించారు. తనపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని ఆమె స్పష్టం చేశారు. కేవలం ఒక చిన్న నోటీసు మాత్రమే తనకు అందిందని, అది కూడా ప్రాథమిక విచారణ దశలోనే ఉందని ఆమె తెలిపారు. ఫామ్ 26లో ఇటువంటి విషయాలను పేర్కొనాల్సిన అవసరం లేదని, రిటర్నింగ్ అధికారి అడిగినప్పుడు తాను నిజాయితీగా సమాధానం చెప్పానని ఆమె చెప్పారు. రెండు వేల పదహారు నాటి పాత వ్యవహారాన్ని ఇప్పుడు లేవనెత్తడం రాజకీయ దురుద్దేశమేనని ఆమె పేర్కొన్నారు. తాను తెలంగాణ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు చేపట్టడానికి చాలా కాలం క్రితమే ఈ ఘటన జరిగిందని ఆమె వివరించారు. వాస్తవాలను వక్రీకరించి తనపై నిందలు వేయడం కరెక్ట్ కాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఎన్నికల సంఘం పూర్తిగా రాజీ పడిందని ఆమె ఘాటుగా విమర్శించారు. రాజ్యసభ సభ్యత్వ సర్టిఫికేట్ల జారీలో ఎన్నికల సంఘం సాంకేతిక అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని ఆమె గుర్తు చేశారు. మీరు నేరుగా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలని కోర్టు సూచించిందని ఆమె వెల్లడించారు. కుంభం శివకుమార్ వ్యవహారంలో కేసు తీవ్రతను సాకుగా చూపి నారాయణపేట టికెట్ నిరాకరించారని, కానీ ఆయనపై ఎలాంటి నేరం రుజువు కాలేదని ఆమె చెప్పారు. కనీసం ఛార్జ్ షీట్ కూడా దాఖలు కాకుండానే టికెట్ నిరాకరించడం దారుణమని ఆమె పేర్కొన్నారు. వ్యక్తిపై ఉన్న ఆరోపణలను సాకుగా చూపి వారి కుటుంబ సభ్యులకు కూడా టికెట్ ఇవ్వకూడదనే నిబంధన ఎక్కడైనా ఉందా అని ఆమె ప్రశ్నించారు. రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ విషయంలో తాము ఒక్క నిమిషం కూడా నిరాశ చెందలేదని ఆమె ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఎంతటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడిందో దేశ ప్రజలందరికీ అర్థమైందని ఆమె గర్వంగా చెప్పారు. ఓటు చోరీ, సీటు చోరీ వంటి అక్రమాలు జరుగుతున్నాయని రాహుల్ గాంధీ గత రెండేళ్లుగా హెచ్చరిస్తూనే ఉన్నారని ఆమె గుర్తు చేశారు. పార్టీలో ఎవరో లీక్ చేస్తున్నారనే ఆరోపణలను ఆమె తోసిపుచ్చారు. తమకు ప్రతి ఒక్క సీటు, ప్రతి సభ్యుడు చాలా ముఖ్యమని ఆమె చెప్పారు. కొన్ని క్లిష్ట పరిస్థితుల్లో మాత్రమే పార్టీ వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుంటుందని ఆమె వివరించారు. గతంలో మన్మోహన్ సింగ్, అభిషేక్ సింఘ్వి వంటి సీనియర్ నేతల విషయంలో కూడా ఇలాగే పార్టీ నిర్ణయాలు తీసుకుందని ఆమె గుర్తు చేశారు. కాబట్టి ఎవరూ అనవసరమైన ఊహాగానాలు నమ్మకూడదని ఆమె కోరారు. దేశ ప్రయోజనాల కోసం అత్యవసరమైన సందర్భాల్లో పార్టీ తీసుకునే నిర్ణయాలు కార్యకర్తలు అర్థం చేసుకోవాలని ఆమె సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో పాటు పార్టీకి చెందిన కీలక సీనియర్ నాయకులు పాల్గొన్నారు. పార్టీ సంస్థాగత బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఓబీసీ వర్గాలను ఏకం చేసి, క్షేత్రస్థాయిలో పార్టీకి కొత్త ఊపిరి పోయాలని నిర్ణయించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంపై ఈ సమావేశంలో ప్రత్యేకంగా దృష్టిసారించారు. నిరంతరం ప్రజల్లో ఉండటం ద్వారానే పార్టీకి తిరుగులేని బలం వస్తుందని నేతలు అభిప్రాయపడ్డారు. సమావేశం ముగింపులో మీనాక్షి నటరాజన్ కార్యకర్తలందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎలాంటి చిల్లర రాజకీయాలకు లొంగకుండా, ప్రజల కోసం నిరంతరం పోరాడాలని ఆమె సూచించారు. పార్టీ వ్యతిరేక శక్తుల ప్రచారాన్ని తిప్పికొట్టడానికి సోషల్ మీడియా వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆమె కోరారు. అధిష్టానం ఎప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో తిరుగులేని శక్తిగా అవతరిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. రాజకీయాల్లో ఓటములు సహజమని, వాటిని అధిగమించి ముందుకు వెళ్లడమే నిజమైన నాయకత్వ లక్షణమని ఆమె వివరించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం మన మొదటి బాధ్యత అని ఆమె గుర్తు చేశారు. ప్రజల నమ్మకాన్ని గెలవడమే మన లక్ష్యం కావాలని ఆమె చెప్పారు. కార్యకర్తలు అధైర్యపడకుండా మరింత ఉత్సాహంతో పని చేయాలని కోరారు. పార్టీని గెలిపించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె నొక్కి చెప్పారు. రాబోయే ఎన్నికల కోసం ఇప్పటి నుండే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచిస్తూ సమావేశాన్ని ముగించారు.

### కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి

# బలంగా తీసుకెళ్లాలి: కేటీఆర్



**చట్టం, శంషాబాద్ :**

రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ పట్టణంలో జేడీ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని కార్యకర్తలకు ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాముఖ్యతను వివరించడంతో పాటు పార్టీ కార్యకర్తలు ప్రజల్లో చురుకుగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న వైఫల్యాలను ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గాంధీ పేరును ఉపయోగిస్తూ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. మహాత్మా గాంధీపై నిజమైన గౌరవం ఉంటే పేదల ఇళ్లను కూల్చకుండా వారి సంక్షేమం కోసం పనిచేయాలని అన్నారు. మూసీ అభివృద్ధి పేరుతో పేదల భూములను స్వాధీనం చేసుకుంటూ అన్యాయం జరుగుతోందని విమర్శించారు. మూసీ ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ విధానాలకు బీజేపీ కూడా మద్దతు ఇస్తోందని ఆరోపించిన కేటీఆర్, కేంద్ర ప్రభుత్వం దీనిపై స్పందించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఎన్నికల హామీల అమలుకు నిధులు లేవని చెబుతూనే, మూసీ ప్రాజెక్టుకు లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతోందని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని కేటీఆర్ పేర్కొన్నారు. సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్, ఎమ్మెల్సీలు నవీన్ రెడ్డి, సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, అంజయ్య యాదవ్, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి, సీనియర్ నాయకుడు రావుల శ్రీధర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కొనముల శ్రీనివాస్, ప్రదీప్ రెడ్డి, మాజీ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్, మాజీ సొసైటీ చైర్మన్ సతీష్, మోహన్ రావు, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, బుచ్చిరెడ్డి, జయసింహ, పవిత్ర సాగర్, రాజేందర్, చరణ్, హనుమంతు, మహేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### వర్షాన్నీ లెక్కచేయని 5K రన్..

# మియాపూర్‌లో సందడి

- లక్ష్మీస్ ఎంపీరియాలో ఘనంగా 5K రన్ నిర్వహణ
- యోగా దినోత్సవం, ఫాదర్స్ డే సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం
- మాజీ కార్పొరేటర్ శ్రీకాంత్ జెండా ఊపి ప్రారంభం
- వర్షంలోనూ ఉత్సాహంగా పాల్గొన్న కమ్యూనిటీ సభ్యులు




**చట్టం, స్టేట్ బ్యూరో:**

ప్రపంచ యోగా దినోత్సవం , ఫాదర్స్ డే (తండ్రుల దినోత్సవం) పురస్కరించుకుని మియాపూర్‌లోని 'లక్ష్మీస్ ఎంపీరియా' కమ్యూనిటీ ఆధ్వర్యంలో 5కే రన్ (5K Run) కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. సమాజంలో ఆరోగ్యం, ఫిట్‌నెస్ , పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ పరుగును చేపట్టారు. లక్ష్మీస్ ఎంపీరియా కమ్యూనిటీ ప్రెసిడెంట్ శ్రీను ముప్పరాజు నేతృత్వంలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. జెండా ఊపి ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ శ్రీకాంత్ ఈ 5కే రన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ శ్రీకాంత్ హాజరయ్యారు. ఆయన జెండా ఊపి పరుగును అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్యంపై సమాజంలో అవగాహన పెంపొందించడం అందరి బాధ్యతని గుర్తు చేశారు. ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా ముఖ్యమేనని, పచ్చదనాన్ని కాపాడటానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

**వర్షాన్నిసైతం లెక్కచేయని రన్నర్స్**

ఈ అవగాహన పరుగులో కమ్యూనిటీకి చెందిన చిన్నారులు, యువత, మహిళలు , వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహపరిచారు. కార్యక్రమం జరిగే సమయంలో వర్షపు వాతావరణం ఉన్నప్పటికీ, రన్నర్స్ ఏమాత్రం వెనకడుగు వేయకుండా ఎంతో జోష్‌తో పరుగెత్తారు. వాతావరణం ఎలా ఉన్నా ఆరోగ్యకరమైన జీవన విధానానికి తాము ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తామంటూ అందరూ ఉత్సాహంగా ముందుకు సాగారు.

**ఘనంగా సహకరించిన స్పాన్సర్లు**

ఈ భారీ కార్యక్రమం విజయవంతం కావడానికి పలు ప్రముఖ విద్యా, వైద్య, ఆర్థిక సంస్థలు స్పాన్సర్లుగా వ్యవహరించి తమ పూర్తి సహకారాన్ని అందించాయి. ఇందులో ప్లాటినమ్ స్కూల్స్ (మయూరి నగర్), కాల్షియం హాస్పిటల్ (హైదర్‌నగర్), యాక్సిస్ బ్యాంక్ (జేపీ నగర్ శాఖ), ఎస్‌బీఐ (మయూరి నగర్), శ్రీకార జూనియర్ కాలేజ్ అండ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ (మియాపూర్), లక్ష్మీ ఇన్‌ఫ్రా , క్యాస్కేడ్స్ ది నియోపోలిస్ (కోకాపేట్) సంస్థలు ఉన్నాయి. కమ్యూనిటీ సభ్యులంతా కలిసికట్టుగా పాల్గొనడంతో ఈ 5కే రన్ గ్రాండ్ సక్సెస్ అయింది.

### ఒక్కసారిగా చెలరేగిన

# మంటలు



**చట్టం, స్టేట్ బ్యూరో:**

కరీంనగర్ జిల్లాలో నేడు ఉదయం ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సు అగ్నిప్రమాదానికి గురైంది. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వాహనం పూర్తిగా దగ్ధమైంది. అయితే డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులందరినీ సురక్షితంగా దించేయడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఆదివారం ఉదయం 8 గంటలకు 40 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయల్దేరింది. అలుగునూర్ శివారులోని కాకతీయ కాలువ సమీపానికి చేరుకోగానే బస్సులో షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ ప్రశాంత్ వెంటనే అప్రమత్తమై బస్సును రోడ్డుపక్కన ఆపాడు. అనంతరం ప్రధాన ద్వారంతో పాటు ఎమర్జెన్సీ గేట్లను తెరిచి ప్రయాణికులందరినీ క్షేమంగా బయటకు పంపించాడు. దీంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ప్రయాణికులను సురక్షితంగా దించిన తర్వాత డ్రైవర్, సిబ్బంది బస్సులో ఉన్న అగ్నిమాపక పరికరాలతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే మంటలు ఎక్కువ కావడంతో వాటిని నియంత్రించడం సాధ్యపడలేదు. కేవలం ఐదు నిమిషాల వ్యవధిలోనే మంటలు బస్సు మొత్తం వ్యాపించి బస్సు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. అయితే ప్రమాదం జరిగిన తర్వాత కూడా అగ్నిమాపక సిబ్బంది ఆలస్యంగా చేరుకున్నారని స్థానికులు ఆరోపించారు.

### తూప్రాన్ మున్సిపాలిటీలో

# ఎంపీ రఘునందన్ రావు పర్యటన

**ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంపీ హామీ**



**చట్టం, తూప్రాన్**

తూప్రాన్ మున్సిపాలిటీ రెండవ వార్డు బీజేపీ కౌన్సిలర్ చందా అశోక్ యాదవ్ విజయోత్సవ ర్యాలీ శనివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధిస్తే గ్రామ దేవత పోచమ్మ తల్లికి మొక్కు చెల్లిస్తానని చేసిన సంకల్పాన్ని నెరవేర్చుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావును ముఖ్య అతిథిగా ఆహ్వానించి భారీ ర్యాలీ చేపట్టారు. నర్సాపూర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన విజయోత్సవ ర్యాలీ ప్రధాన రహదారి గుండా తాతాపాపనిపల్లి వరకు అంగరంగ వైభవంగా కొనసాగింది. ర్యాలీలో పెద్ద సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, యువకులు పాల్గొని జైకారాలు చేస్తూ ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. అనంతరం తాతాపాపనిపల్లిలోని పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం జరిగిన సభలో ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామీణ ప్రాంతాలకు మరింత చేరువ చేస్తూ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. తాతాపాపనిపల్లి మహిళల విజ్ఞప్తి మేరకు మహిళా సమాఖ్య భవన నిర్మాణం కోసం ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రకటనతో మహిళలు హర్షం వ్యక్తం చేశారు. రోడ్లు, రైల్వే, దేవాలయాల అభివృద్ధికి హామీలు వెంకటాపూర్ పీటీ నుంచి నర్సాపూర్ గుల్లపల్లి వరకు లింక్ రోడ్డును ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే బ్రాహ్మణపల్లిలో ఉన్న రైల్వే స్టేషన్‌కు తూప్రాన్ పేరును అధికారికంగా నామకరణం చేయడంతో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటు కోసం రైల్వే శాఖ మంత్రిని స్వయంగా కలిసి ప్రతిపాదిస్తానని తెలిపారు. రెండవ వార్డులోని మాలజంగం వాడలో అసంపూర్తిగా ఉన్న శివాలయ నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన స్టీల్, సిమెంట్ అందజేస్తామని హామీ ఇచ్చారు. బుడగ జంగాల కాలనీలో సమస్యలపై స్పందన ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న బుడగ జంగాల కాలనీ ప్రజలు త్రాగునీటి సమస్య, వీధి దీపాలు, సీసీ రోడ్లు, కట్టు కాల్వ మత్తడి వద్ద వంతెన నిర్మాణం వంటి సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన రఘునందన్ రావు సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక కౌన్సిలర్ చందా అశోక్ యాదవ్‌తో సమన్వయం చేసుకొని మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. విజయోత్సవ ర్యాలీతో తూప్రాన్ పట్టణం బీజేపీ జెండాలతో కళకళలాడగా, ద్విచక్ర వాహనాలు పై కమలం జండాలు ఊపుతూ డీజే సౌండ్ తో పాటు రంగు రంగుల కాగితాల పూల వర్షం, భారీబాన సంచా పాతకులు కాల్చి ఘనంగా విజయోత్సవం నిర్వహించారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, సీనియర్ నాయకులు సంఖ్య యాదగిరి, రోడ్డ మధు గౌడ్, మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు భూమన్నగారి జానకిరామ్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, నత్తి మల్లేష్, తూప్రాన్ మండల అధ్యక్షుడు పిట్ల పోచయ్య, మనోహరాబాద్ మండల అధ్యక్షుడు వెంకటేశం గౌడ్, కౌన్సిలర్ సత్యనారాయణ, లయన్ దేవత సాయికిరణ్ గుప్త, బాధే వాసుదేవ్, పోతరాజు శరత్ కుమార్ తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### కేబీఆర్ పార్క్ పరిసరాల్లో

# ట్రాఫిక్ వన్‌వే ట్రయల్ రన్



## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చదివిస్తే ఇల్లు టాక్స్ ఫ్రీ

**ఉమ్మెడ సర్పంచ్ జంగిలి భోజేందర్ వినూత్న ప్రయత్నం**



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్ మండలం ఉమ్మెడ గ్రామంలోని ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలకు అర్హులైన విద్యార్థులను చదివిస్తే ఐదు సంవత్సరాలు గ్రామ పంచాయతీకి చెల్లించవలసిన ఇల్లు టాక్స్ ను ఉచితంగా అందిస్తామని ఉమ్మెడ సర్పంచి జంగిలి భోజేందర్ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయానికి విద్యార్థుల తల్లిదండ్రులు స్పందించి శనివారం రోజు దాదాపు 20 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. విద్యా వాలంటీర్లకు వేతనాలు అందిస్తామని గ్రామ పంచాయతీ తీర్మానం చేశారు. సర్పంచి తీసుకున్న నిర్ణయానికి గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బర్రె ఆనంద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ రెడ్డి, అనుప్రియ, వార్డ్ మెంబర్లు, ఇంచార్జ్ పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, వీడిసి సభ్యులు, ఏపీఎస్ చైర్ పర్సన్ శకుంతల, మహిళా సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి పట్టా అందుకున్న వై.ప్రమీల



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం పిప్రి గ్రామానికి చెందిన వై.ప్రమీల, తెలంగాణ విశ్వవిద్యాలయం అప్లైడ్ ఎకనామిక్స్ విభాగంలో పరిశోధన చేసినందుకు గాను ఆమెకు పి.హెచ్.డి (Ph.D) డిగ్రీ ప్రధానం చేసినట్లు విశ్వవిద్యాలయం అధికారులు తెలిపారు. ఆమె 'AN ECONOMIC ANALYSIS OF CHILD LABOUR A STUDY IN NIZAMABAD DISTRICT OF TELANGANA STATE' (తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాలో బాల కార్మికుల ఆర్థిక విశ్లేషణ ఒక అధ్యయనం) అనే అంశంపై ఆచార్య రవీందర్ రెడ్డి, పర్యవేక్షణలో అత్యుత్తమ పరిశోధన చేశారు. ఈ మధ్య నిర్వహించిన పి.హెచ్.డి మౌఖిక పరీక్ష కు కాకతీయ విశ్వవిద్యాలయం నుండి వచ్చిన ఆచార్య సురేష్ లాల్, బాహ్య పరీక్షకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అప్లైడ్ ఎకనామిక్స్ విభాగపు అధ్యాపకులు, ఇతర పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్రమీల పరిశోధన ప్రెజెంటేషన్‌ను అభినందించారు. ఆమె కృషికి ఫలితంగా ఆమెకు యూనివర్సిటీ అధ్యాపకులు పి.హెచ్.డి పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవం



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రోజు ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ మద్దికుంట శ్రీనివాస్, యోగ డే గూర్చి విద్యార్థులకు అవగాహన కల్పించారు. యోగ ప్రతీరోజూ చేయడం వలన శారీరక, మానసికంగా మనం ఆరోగ్యంగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహణ



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని క్షత్రియ ఫంక్షన్ హాల్ లో ఆదివారం రోజు 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యానగర్ యోగ కమిటీ, పతంజలి యోగ మిత్రుల ఆధ్వర్యంలో యోగా దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్య నగర్ యోగ సెంటర్ ను ఆర్మూర్ మాజీ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వివేకానంద రెడ్డి, పతంజలి యోగ మిత్రుడు దోండి జయరాజ్, ఆధ్వర్యంలో వారి ప్రోత్సాహంతో గత రెండు సంవత్సరాల నుండి ప్రపంచ యోగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ రోజు ఉదయం జయరాజ్, హవన పూజా, యజ్ఞ కార్యక్రమంతో ప్రారంభించారు. అనంతరం యోగా మాస్టర్ రజనీకాంత్, జెంటిల్ కిడ్స్ ప్రకాష్, ఆధ్వర్యంలో యోగ సాధకులు 108 సూర్య నమస్కారాలు, వివిధ యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎస్.ఎస్.కే ఆర్మూర్ సమాజ్ అధ్యక్షులు రెడ్డి ప్రకాష్, మాట్లాడుతూ యోగా మనిషి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడటంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యానగర్ యోగ కమిటీ సభ్యులు కొంగి మనోహర్, మాట్లాడుతూ యోగ ద్వారా కలిగే శారీరక, మానసిక దృఢత్వం, ఏకాగ్రత, ప్రశాంతత వంటి ప్రయోజనాలను వివరించారు. ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో యోగా సాధకులు సుమారు 100 మంది వరకు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యోగా మిత్రులు మీనా రాకేష్, రజనీకాంత్, జెంటిల్ కిడ్స్ ప్రకాష్, విజయ్ మనోహర్ సార్, నరేష్, రాకేష్, శ్రీనివాస్, శ్రవణ్, గణేష్, మురళి, సుంకే శ్రీనివాస్, డిష్ శ్రీనివాస్, గణేశ్, సురేష్ నాయుడు, సుభాష్, మనోజ్, మోహన్, బాలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## హౌసింగ్ బోర్డు ఓపెన్ జిమ్లో స్వచ్ఛ భారత్





**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనిలో గల ఓపెన్ జిమ్ ఆవరణలో ఆదివారం రోజు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిమ్ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్త చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సుంకె శ్రీనివాస్, మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో నిర్వహిస్తున్న స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా 59వ ఆదివారం హౌసింగ్ బోర్డు కాలనిలో గల ఓపెన్ జిమ్లో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రతి నిత్యం ఎంతో మంది ఈ జిమ్లో వ్యాయమాలు చేస్తుంటారని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా జిమ్ చుట్టు పేరుకుపోయిన చెత్తను తొలగించామన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ సభ్యుడు కోటేశ్వర్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, బట్టు సుమన్, జహీర్, కుతాడి ఎల్లయ్య, గుర్రం రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## అసలు మీకు చెట్ల విలువ తెలుసా..

**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని మామిడిపల్లి నుండి అంబేత్కర్ చౌరస్తా వరకు ఉన్న డివైడర్ మధ్యలో గల చెట్లను మున్సిపల్ కమిషన్, ఆదేశాలతో నరికివేస్తున్నారు. ఈ చెట్లని గత 8 సంవత్సరాల నుండి పెంచడం జరుగుతుంది ఇప్పుడు వీటిని నరికి వేస్తున్నారు. అసలు మీకు చెట్ల విలువ తెలుసా.? అంటూ ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పూజా నరేందర్, ఆయన మాట్లాడుతూ ఒక్కో చెట్టుని పెంచాలంటే కనీసం 8 సంవత్సరాలు కాలం పడుతుంది, గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మా తెలంగాణ తొలి ముఖ్య మంత్రివర్యులు ఒక గొప్ప ప్రోగ్రాం హరిత హారం అనే విప్లం తీసుకు వచ్చారు. కానీ మీరు చెట్లు నరికి దానికి విరుద్ధంగ చేస్తున్నారు అని మండి పడ్డారు. ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి, కూడా దీని మీద స్పందించారు అయినా మీకు దున్న పోతు పైన ఆన పడ్డట్టు ఉందన్నారు. దీనిని వెంటనే ఆపి వేయాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. అలాగే ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ఆఫీసర్లు కూడా స్పందించాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. లేని పక్షంలో ఉద్యమిస్తాం అని హెచ్చరిక జారీ చేశారు.

# ప్రపంచానికి అందించిన ఆధ్యాత్మిక సంపదల్లో యోగా ఒకటి







- **యోగాతో మందులు లేని వైద్యం**
- **ప్రధాని నరేంద్ర మోదీ యోగాను విశ్వవ్యాప్తం చేశారు**
- **అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**

**చట్టం ఇందూరు :**

భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప ఆధ్యాత్మిక సంపదల్లో యోగా ఒకటని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యోగాతో కేవలం ఆరోగ్య ప్రయోజనాలే కాకుండా మనిషి వ్యక్తిత్వం, ఆలోచన విధానం, సమాజం, ప్రకృతి మధ్య ఉన్న అనుబంధాన్ని కూడా బలపరుస్తుందన్నారు. ఆధునిక కాలంలో చాలామంది యోగా అంటే కేవలం ఆసనాలు వేయడం, బరువు తగ్గడం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అని భావిస్తున్నారని తెలిపారు. కానీ మనిషి శరీరం, మనసు, ఆత్మ మధ్య సమన్వయాన్ని సాధించడమే యోగా అసలు లక్ష్యమని పేర్కొన్నారు. మనిషి సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ మానసిక ప్రశాంతతను కోల్పోతున్నాడని, ఒత్తిడి, ఆందోళన పెరుగుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యోగా ఔషధంలా పనిచేస్తుందని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యోగాను విశ్వవ్యాప్తం చేశారని, ఐక్యరాజ్యసమితి వేదికపై 2014 సెప్టెంబర్ 27న యోగాను అంతర్జాతీయ దినోత్సవం గా ప్రకటించాలని ప్రతిపాదించాలని గుర్తు చేశారు. డిసెంబర్ 11న.. 177 దేశాల మద్దతుతో జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించడం జరిగిందని తెలిపారు. యోగాకు కులం, మతం, ప్రాంతం అనే భేదాలు లేవని ప్రతి మనిషి ఆరోగ్యం, శాంతి కోసం రూపొందించిన జీవన విధానమని చెప్పారు. అనంతరం ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. విద్యార్థులు చేసిన విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆయుష్ శాఖ ఆఫీసర్ గంగాదాస్, మేరా యువ భారత్ సమన్వయకర్త రమేష్, డివైఎస్ఓ పవన్ కుమార్, యోగా గురువులు ప్రభాకర్, సిద్ధి రాములు, రామచందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

**ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో..**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్బన్ ఎంఎల్ఏ ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతిరోజు కొన్ని నిమిషాల యోగా..జీవితానికి ఎన్నో సంవత్సరాల ఆరోగ్యాన్నిస్తుందన్నారు. యోగ కేవలం వ్యాయామం కాదని, జీవితం ఎలా గడపాలో నేర్పే విజ్ఞానం అన్నారు. కార్యక్రమంలో ఆర్య సమాజ్ అధ్యక్షులు మహంకాళి విజయ్, ఉపాధ్యక్షులు రాజులు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ప్రసన్న, బీజేపీ కార్పొరేటర్ జ్యోతి మురళి, సీనియర్ నాయకులు ఇల్లెందుల ప్రభాకర్, కృష్ణ మారావార్, శ్రీనివాస్ పాల్గొన్నారు

## NEETUG 2026 పరీక్ష కేంద్రాల భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన ఇంచార్జి పోలీస్ కమిషనర్

**చట్టం నిజామాబాద్ ప్రతినిధి :**



జిల్లాలో నిర్వహించిన NEETUG 2026 ప్రవేశ పరీక్ష సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఇంచార్జి పోలీస్ కమిషనర్, కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీతో పాటు నిజామాబాద్, బోధన్ ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలను సందర్శించి బందోబస్తు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు విస్తృతమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ అధికారులను ఆదేశించారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. పరీక్షల నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా సెక్యూరిటీ తనిఖీలను కఠినంగా నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా పోలీసు శాఖ పూర్తిస్థాయిలో సహకరిస్తుందని తెలిపారు. పరీక్షల విజయవంతమైన నిర్వహణకు నగర ప్రజలు కూడా పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, ఐపీఎస్, పరీక్ష కేంద్రాల ప్రిన్సిపాల్స్, అబ్జర్వర్లు, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## సిద్దిపేట అభివృద్ధిపై కాంగ్రెస్‌కు హక్కు లేదన్న బీఆర్ఎస్ నాయకులు



**చట్టం సిద్దిపేట ప్రతినిధి** : సిద్దిపేట అభివృద్ధిపై విమర్శలు చేసే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి కొత్త కార్యక్రమాలు చేపట్టలేదని ఆరోపించారు. గతంలో మంజూరైన పలు అభివృద్ధి పనులను నిలిపివేసి, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో గెలుస్తామని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు చొరవతో సిద్దిపేట రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచే విధంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. తాగునీరు, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, పరిశుభ్రత, హరిత హారం వంటి కార్యక్రమాలతో పట్టణం అభివృద్ధి చెందిందన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో అనేక అవార్డులు సిద్దిపేటకు రావడం ఇందుకు నిదర్శనమని తెలిపారు. శిల్పారామం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఆసుపత్రి, రంగనాయక సాగర్ వంటి పనులను పూర్తి చేసి అభివృద్ధిపై మాట్లాడాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేటకు వచ్చి ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అంతర్గత విభేదాలతోనే ఇబ్బందులు ఎదుర్కొంటోందని, ప్రజలు మాత్రం బీఆర్ఎస్‌కు మద్దతుగా ఉన్నారని అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూడా ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతారని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సాయి ప్రేమ్, మహిపాల్ గౌడ్, ఇరుగంటి రమేష్, పర్శ రాములు, దాసరి రమేష్, రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతల విమర్శలు

**హరీష్ రావు హయాంలోనే సిద్దిపేట అభివృద్ధి: చిన్నకోడూరు నాయకులు**

**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :**

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మైలారం, కమ్మర్లపల్లి గ్రామాల్లో జరిగిన పోచమ్మ తల్లి దేవాలయ ఉత్సవాలు, బోనాల కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. అనంతరం మాట్లాడిన మాజీ ఎంపీపీ మాణిక్య రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రైతులకు సకాలంలో ఎరువులు అందించడం లేదని, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని, రైతుబంధు అమలులో నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500, కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం ఇస్తామని చెప్పి అమలు చేయలేదని విమర్శించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు కృషితో సిద్దిపేట జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. చిన్నకోడూరు మండలంలో రిజర్వాయర్ నిర్మాణంతో సాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని, తాగునీటి ఇబ్బందులు తొలగిపోయాయని తెలిపారు. త్వరలో చిన్నకోడూరులో రైల్వే స్టేషన్ పనులు ప్రారంభమై రైలు సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి ప్రజలకు మళ్లీ మంచి రోజులు వస్తాయని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కనకరాజు, కొండం రవీందర్ రెడ్డి, పాపయ్య, కాల్వ ఎల్లయ్య, ఉమేష్ చంద్ర, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఇందూరు...యోగా గురువులకు నిలయం

- **యోగా సాధనతో ఒత్తిడి..ఆందోళన దూరం**
- **బీజేపీ ఇందూరు శాఖ యోగా దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే**



**చట్టం ఇందూరు :** ఇందూరు జిల్లా యోగా గురువులకు నిలయమని, అనేకమంది విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ సత్తా చాటారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. భారతీయ జనతా పార్టీ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... యోగా అంటే శరీర వ్యాయామం కాదని జీవన విజ్ఞానం అన్నారు. వ్యక్తిత్వం ఆలోచన విధానం సమాజం ప్రకృతి మధ్య ఉన్న అనుబంధాన్ని కూడా యోగ బలపరుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం యోగా కోసం సమయం కేటాయించాలన్నారు. ప్రధానంగా యోగా సాధన ద్వారా సహనం క్రమశిక్షణ పరస్పర గౌరవం వంటి విలువలు పెరుగుతాయి అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీ నారాయణ, ఫ్లోర్ లీడర్ ప్రమోద్, కార్పోరేటర్లు జగదీష్ కులకర్ణి , చింతకాయల రాజేందర్, మల్కాయి మహేందర్, సీనియర్ నాయకులు న్యాలం రాజు, ఇప్పకాయల కిషోర్, మురళీ, బొబ్బిలి వేణు, శ్రీనివాస్, ఇల్లెందుల ప్రభాకర్, కృష్ణ, బి.శ్రీనివాస్, బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి విజయ్, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## పోతారం గ్రామంలో ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమం



**చట్టం శివ్వంపేట :** మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలో గల పోతారం గ్రామంలో పుట్ట భారతి, ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుట్ట వినోద మహేందర్, పాల్గొని.ఇంటి యజమానురాలికి ఈ సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సొంత ఇంటి కలను నెరవేరుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మన్నే సురేష్, వడ్ల రాములు, పుట్ట కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్‌లో తనిఖీ

- **శుభ్రత, వసతి సౌకర్యాలపై సూచనలు**



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్‌ను జాతీయ మానవ హక్కుల కమిటీ సిద్దిపేట జిల్లా బృందం సందర్శించి తనిఖీలు నిర్వహించింది. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వసతి సౌకర్యాలు, పరిశుభ్రత, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించింది. తనిఖీల సందర్భంగా హాస్టల్‌లో శుభ్రత నిర్వహణలో నిర్లక్ష్యం, కొన్ని అవకతవకలు ఉన్నట్లు బృందం గుర్తించింది. ఇలాంటి లోపాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వార్డెన్ మల్లేశంకు సూచించింది. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంతో పాటు నాణ్యమైన, పోషకాహారం అందించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరింది. ఈ తనిఖీ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ ఈసీ సభ్యుడు సంపత్, జిల్లా అధ్యక్షుడు నెమలి సుభాష్, గౌరవ సలహాదారు బోయ రాములు, ఉపాధ్యక్షుడు ప్రభురాజ్, జనరల్ సెక్రటరీ కార్తీక్ రెడ్డి, టౌన్ అధ్యక్షురాలు సునీత, ఉపాధ్యక్షుడు రాంగోపాల్, బాలు కరాటే, జనరల్ సెక్రటరీ వెంకటలక్ష్మి, జాయింట్ జనరల్ సెక్రటరీ సుజాత పాల్గొన్నారు.

## ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో యోగా దినోత్సవం

**చట్టం – ముస్తాబాద్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో శనివారం యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జ్యోతి పోలీస్ సిబ్బందితో కలిసి యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. నిత్యం యోగా చేయడం వల్ల ఒత్తిడి తగ్గడంతో పాటు ఏకాగ్రత పెరిగి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది తమ విధుల్లో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొని వివిధ యోగాసనాలు చేశారు.



# జూన్ 23న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపు

- ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, ఫీజుల నియంత్రణ
- మౌలిక వసతుల కల్పనపై పలు డిమాండ్లు



**చట్టం భైంసా :**

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ జూన్ 23న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ మేరకు భైంసాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర హాస్టల్ కోకన్వీనర్ గంగా ప్రసాద్ మాట్లాడుతూ పలు అంశాలను ప్రస్తావించారు. రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్ల అమలును పకడ్బందీగా చేపట్టాలని కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరతను వెంటనే తీర్చాలని, ఎంఈఓ, డీఈఓ వంటి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు పునరావృతం కాకుండా పర్యవేక్షణను బలోపేతం చేయాలని కోరారు. జాతీయ విద్యా విధానం (NEP2020), విద్యాహక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంకా పంపిణీ కాని యూనిఫాంలను వెంటనే అందించాలని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 23న చేపట్టనున్న పాఠశాలల బంద్‌కు విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించి విజయవంతం చేయాలని ఏబీవీపీ విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ విద్యా వ్యవస్థకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించింది. ఈ విలేకరుల సమావేశంలో ఇందూరు మాధవ్, రవి, గంగా ప్రసాద్, గణేష్, స్వార్థిక్, అఖిలేష్, నరేందర్ తదితర ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుంటాలలో సి. సి రోడ్ల నిర్మాణానికి 66.50 లక్షల నిధులు

## కుంటాల సర్పంచ్ కు ప్రొసీడింగ్ కాపీని అందజేసిన ఎమ్మెల్యే



**చట్టం, కుంటాల :** గత పది సంవత్సరాల కాలంలో కుంటాల మండల కేంద్రం అభివృద్ధి పరంగా వెనుక పడడంతో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ఒకేసారి సిసి రోడ్లు, డ్రైనేజీలు, నిర్మాణానికి 66.50 లక్షల రూపాయల ఉపాధి హామీ నిధులను మంజూరు చేయించారు. సంబంధిత మంజూరు పత్రాన్ని భైంసా లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం కుంటాల సర్పంచ్ గజేందర్ కు అందజేశారు. పద్మశాలి సంఘం నుండి గ్రామపంచాయతీ వరకు రోడు నిర్మాణం కోసం 11 లక్షలు, జిపి నుండి హనుమాన్ టెంపుల్ కు9లక్షలు , గజ్జరం ఇంటి నుండి గజ్జలమ్మ టెంపుల్ వరకు 9.5 లక్షలు, సబ్బిడి రమేష్ ఇంటి నుండి గోవర్ధన్ ఇంటి వరకు 12 లక్షల రూపాయల నిధులు, శ్రీనివాస్ ఇంటి నుండి శ్రీకాంత్ ఇంటి వరకు 5.5 లక్షలు నిధులు, రవి ఇంటి నుండి గ్రామపంచాయతీ వరకు 9. 5 లక్షలు, తాటి సోమేశ్వర్ ఇంటి నుండి కటికే గంగాధర్ ఇంటి వరకు 2.5 లక్షలు, రూపాయలు, హన్మాండ్లు ఇంటి నుండి జుట్టు నవీన్ ఇంటి వరకు 3.5 లక్షల నిధులు, గంగారెడ్డి ఇంటి నుండి మేర లింగం ఇంటి వరకు 4 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించారు. ఒకేసారి పెద్ద మొత్తంలో నిధులు రావడంతో సర్పంచ్ గజేందర్, గ్రామస్తుల తరఫున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెప్పారు. ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, మా గ్రామానికి నిధులు పెద్ద మొత్తంలో రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.10.50 కోట్లతో 35 గ్రామాల్లో గోదాముల నిర్మాణం



**చట్టం, భైంసా :** రైతులు పండించిన పంటను సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు ముధోల్ నియోజకవర్గంలోని 35 గ్రామాల్లో గోదాముల నిర్మాణానికి రూ.10 కోట్ల 50 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఒక్కో గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో గోదాములు నిర్మించనున్నారు. ఈ గోదాముల నిర్మాణంతో రైతులు పంటను నిల్వ చేసుకునేందుకు అవసరమైన సౌకర్యం కల్పించబడటంతో పాటు, తక్షణ విక్రయాల ఒత్తిడి తగ్గి మెరుగైన ధర లభించే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ముధోల్ నియోజకవర్గంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పలు అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గతంలో వెనుకబడిన గ్రామాలకు ప్రస్తుతం మౌలిక వసతులు కల్పించే దిశగా పెద్ద ఎత్తున నిధులు మంజూరవుతున్నాయని వెల్లడించారు. గోదాముల నిర్మాణానికి బాసర మండలంలోని టాక్లి, కిర్గుల్ (కే), భైంసా మండలంలోని బిజ్జూర్, వానలపాడ్, మహాగాం, కుంసర్, ఇలేగాం, కుబీర్ మండలంలోని పార్డి (బి), పార్డి (కే), పల్సి, హంపోలి, కుంటాల మండలంలోని లింబకే, లింబా (బి), విట్టాపూర్, పెంచికల్‌పాడ్, ఓలా, లోకేశ్వరం మండలంలోని ధర్మోరా, పిప్రి, అబ్దుల్లాపూర్, కనకాపూర్, నరసింహనగర్ తాండ, ముధోల్ మండలంలోని గన్నోరా, ముద్గల్, బోరిగాం, అష్ట, రాంటేక్, నర్సాపూర్ మండలంలోని తిమ్మాపూర్, డోంగూర్‌గావ్, నందన్, తానూర్ మండలంలోని బోరిగావ్ బామ్ని, బొంద్రట్, భోసి, బెల్ తరోడా గ్రామాలు ఎంపికయ్యాయి. ఈ పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ మౌలిక సదుపాయాలు మరింత బలోపేతం కావడంతో పాటు రైతులకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరనుంది.

# అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలు, ఫిట్‌నెస్ లేని బస్సులపై వెంటనే చర్యలు తీసుకోవాలి



**చట్టం, శంషాబాద్ :** శంషాబాద్ మండల కేంద్రంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రతను ప్రమాదంలోకి నెట్టే విధంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా నడుస్తున్న స్కూల్ బస్సులను తక్షణమే సీజ్ చేసి, సంబంధిత యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలు, జీఓలను ఉల్లంఘిస్తూ విద్యను వ్యాపారంగా మార్చిన పాఠశాలలపై ఎలాంటి ఉపశమనం కల్పించకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలను పాటించని విద్యాసంస్థల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రాణాలు, వారి భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న అక్రమ పాఠశాలలపై అధికారులు ఆలస్యం చేయకుండా చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో భారీ స్థాయిలో ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు, సంబంధిత కార్యాలయాల ముట్టడిలతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించబోమని, ఫిట్‌నెస్ లేని వాహనాలు నడపడం, అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహించడం వంటి అంశాలపై సంబంధిత అధికారులు తక్షణమే తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నీటి సమస్యకు పరిష్కారం.. బోరు మంజూరు



**చట్టం, తానూర్ :** నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని బామ్ని తండా గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. ఇటీవల గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా గ్రామస్తులు తమ నీటి ఎద్దడి సమస్యను మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తుల విజ్ఞప్తిపై స్పందించిన విట్టల్ రెడ్డి సమస్యను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లడంతో గ్రామానికి బోరు మంజూరైంది. దీంతో గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. నీటి సమస్యను పరిష్కరించడంలో సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డికి గ్రామస్తులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, స్థానిక సర్పంచ్ గులాబ్, నాయక్ పుండాలిక్, కారోబార్ అప్పారావు, దవు మన్సింగ్, రామారావు, బామ్ని సర్పంచ్ గణేష్, మాజీ సభ్యుడు శంకర్, రోహిదాస్ తదితరులు పాల్గొన్నారు.

# పాల ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు




**చట్టం, ముధోల్ :** ముధోల్ నియోజకవర్గానికి చెందిన పాల ఉత్పత్తిదారులు, పాడి పరిశ్రమ రైతులు భైంసా పట్టణంలోని గణేష్‌నగర్‌లో ఉన్న మున్నూరు కాపు సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం సంఘాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పాలకు గిట్టుబాటు ధర లభించడం లేదని, ఉత్పత్తి వ్యయాలు రోజురోజుకు పెరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లీటరు పాలకు కనీసం రూ.70 ధర కల్పించాలని ప్రభుత్వాన్ని పాల వ్యాపారులను కోరారు. సంఘ అధ్యక్షుడిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా ప్రసాద్ ఎన్నికయ్యారు. రైతులు మాట్లాడుతూ... పాలిచ్చే గేదె ధర ప్రస్తుతం రూ.1 లక్షకు పైగా పలుకుతోందని, పశువుల మేత, దాణా, మందులు, నిర్వహణ ఖర్చులు కూడా గణనీయంగా పెరిగాయని తెలిపారు. అయితే పాల ధరలు మాత్రం అందుకు అనుగుణంగా పెరగకపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పాల వ్యాపారులు, డెయిరీ యాజమాన్యాలు, హోటల్ నిర్వాహకులు పాల ఉత్పత్తిదారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని గిట్టుబాటు ధర చెల్లించాలని సమావేశంలో తీర్మానించారు. పాడి రైతుల హక్కుల సాధన కోసం సంఘం తరఫున భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు.

# ముధోల్ నియోజకవర్గంలో ఆరెల్లి మైసమ్మ పండుగ వేడుకలు

## గోదావరి జలాలతో గ్రామదేవతలకు అభిషేకాలు.. గ్రామ సుభిక్షం కోసం ప్రత్యేక పూజలు



**చట్టం, ముధోల్ :** నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గంలోని ముధోల్, బాసర, భైంసా, కుబీర్, కుంటాల, లోకేశ్వరం, తానూర్ మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆరెల్లి మైసమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు సంప్రదాయ ఆచారాలను పాటిస్తూ పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొన్నారు. పండుగలో భాగంగా మహిళలు, పురుషులు కాలి బిందెలతో గోదావరి నది తీరానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం గోదావరి జలాలను గ్రామాలకు తీసుకువచ్చి గ్రామదేవతలకు జలాభిషేకాలు నిర్వహించారు. భాజా భజంత్రీలు, డప్పు వాయిద్యాల నడుమ భక్తులు ఊరేగింపుగా మైసమ్మ, పోచమ్మ ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ప్రతి ఏడాది సంప్రదాయంగా నిర్వహించే ఈ పండుగకు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు కోరుకున్నారు. కుటుంబాల్లో సుఖశాంతులు నెలకొనాలని, గ్రామాలు సుభిక్షంగా ఉండాలని భక్తులు మొక్కులు చెల్లించారు. ఈ ఏడాది మృగశిర కార్తె ముగిసి ఆరుద్ర కార్తె ప్రారంభమైనప్పటికీ వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, వ్యవసాయం అభివృద్ధి చెందాలని అమ్మవారిని వేడుకున్నారు. పండుగ సందర్భంగా గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. సంప్రదాయ వాయిద్యాలు, భక్తిగీతాల నడుమ జరిగిన వేడుకలు గ్రామ ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆరెల్లి మైసమ్మ పండుగ గ్రామాల ఐక్యత, సంప్రదాయ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, రైతులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతం చేశారు.

# గ్రామ అభివృద్ధికి ముందడుగు

- లింగంపల్లిని జిల్లాకే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ప్రజల దీవెనలే బలం.. సమగ్ర అభివృద్ధే ధ్యేయం



**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :**

వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండలం లింగంపల్లి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగం పుంజుకుంటున్నాయి. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని నూతన పాలకవర్గం కార్యాచరణ కొనసాగిస్తోంది. గ్రామంలో మౌలిక వసతుల విస్తరణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా మెరుగుదల, వీధి దీపాల ఏర్పాటు, రహదారుల అభివృద్ధి వంటి పనులను ప్రాధాన్యతగా చేపడుతోంది. ప్రజల నుంచి నేరుగా సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటోంది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా చర్యలు ప్రారంభించింది. వీధుల్లో పారిశుద్ధ్య పనులు, దోమల నివారణ కోసం మందు పిచికారీ, తాగునీటి సౌకర్యాల బలోపేతం వంటి కార్యక్రమాలు ఇప్పటికే అమలులోకి వచ్చాయి. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పాలకవర్గం తెలిపింది. ప్రతి ఇంటికి అవసరమైన మౌలిక సదుపాయాలు చేరేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. ఈ సందర్భంగా సర్పంచ్ వడ్ల శోభా పరమేశ్వర్ మాట్లాడుతూ, లింగంపల్లి గ్రామాన్ని జిల్లాకే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన ధ్యేయమని, ప్రజల విశ్వాసం, ఆశీర్వాదాలే తమకు బలమని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి విషయంలో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు. వార్డు సభ్యులు కూడా గ్రామ ప్రజలతో నిరంతరం మమేకమవుతూ సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందిస్తున్నారని తెలిపారు. ప్రజల సూచనలకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తుండటంతో గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ఎలాంటి వివక్ష లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సమాన ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు పాలకవర్గం స్పష్టం చేసింది. గ్రామంలో ఏ సమస్య ఉన్నా నేరుగా తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి జిల్లాకు ఆదర్శంగా నిలబెట్టేందుకు కట్టుబడి ఉన్నట్లు పాలకవర్గం వెల్లడించింది.

# అర్హులైన ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి: కట్కూరి మల్లేష్



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :**

తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా మహాసభ నిర్మల్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో నిర్వహించారు. మహాసభకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా బాధ్యుడు కుంటోల్ల వెంకటస్వామి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా వ్యవస్థాపక అధ్యక్షుడు కట్కూరి మల్లేష్, వ్యవస్థాపక నాయకుడు, సలహాదారు ఆరెల్లి మల్లేష్, రాష్ట్ర అధ్యక్షుడు కాదేపురం గంగన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తెడ్డు సాయిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కట్కూరి మల్లేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అక్రిడిటేషన్ కార్డులతో పాటు ఇండ్ల స్థలాలు, బస్సు పాసులు, రైల్వే పాసులు, హెల్త్ కార్డులు అందించాలని కోరారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య కల్పించాలని అన్నారు. ఈ అంశాలపై ఇప్పటికే పౌరసంబంధాల సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఐ అండ్ పీఆర్ కమిషనర్ ముకుంద రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. త్వరలో జరిగే అక్రిడిటేషన్ కమిటీ సమావేశాల్లో రాష్ట్రంలోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులందరికీ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో జరిగిన అక్రిడిటేషన్ కమిటీ సమావేశాల్లో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. కొంతమంది అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు అక్రమాలకు పాల్పడి డబ్బులు తీసుకుని అర్హత లేని వారికి కార్డులు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. పెద్ద పత్రిక, చిన్న పత్రిక అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలెక్టరేట్, డీపీఆర్వో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఈరోల పురుషోత్తం, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కుంటోల్ల యాదగిరి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెలుమల ప్రభాకర్, ఎస్సీ ఎస్టీ అడ్వకేట్స్ జేఏసీ చైర్మన్ రత్నం, జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులు పాల్గొన్నారు. మహాసభ అనంతరం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కొండ రవి, ఉపాధ్యక్షులుగా గైని భోజన్న, రాసమల్ల భాస్కర్, అబ్బువార్ గౌతమ్, ప్రధాన కార్యదర్శిగా వాగ్మారే కపిల్, సహాయ కార్యదర్శిగా సాయినాథ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా సింగిడి అమృత్, కోశాధికారిగా కడగొల్ల లచ్చిరాం, కమిటీ సభ్యుడిగా కారండే గంగాధర్, న్యాయ సలహాదారుగా రత్నం, గౌరవ సలహాదారుగా వెలుమల ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీ సభ్యులను రాష్ట్ర నాయకత్వం అభినందించింది.

# ఉప ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే





**చట్టం ఆర్మూర్:** తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోనీ సచివాలయంలో ఆదివారం రోజు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, తన నియోజకవర్గంలో ఆసంపూర్తిగా ఉన్న పనులను తక్షణమే చేయాలని, అలాగే పెండింగ్ బిల్లులను కాంట్రాక్టర్లకు విడుదల చేస్తే పనులు త్వరితగతిన పూర్తవుతాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ను కలిసి విన్నవించారు. కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని వెంటనే విడుదల చేస్తే పనులు పూర్తవుతాయని సానుకూలంగా స్పందించి అతి త్వరలో బిల్లులు విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తెలిపారు. అనంతరం మంత్రి వాకిడి శ్రీహరి, నీ కలిసి ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్ లో మినీ స్టేడియం కు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు.

# సర్పంచ్ కల్లూరి హనుమంతరావు ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం



**చట్టం, న్యూస్ శివ్వంపేట :** మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని ఏదుల్లాపూర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో స్థానిక సర్పంచ్ కల్లూరు హనుమంతరావు ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులకు యూనిఫార్మ్ పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ కల్లూరు హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం తమ వంతు సహకారం తప్పకుండా అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధి కోసం కూడా తాము కృషి చేస్తున్నామని కల్లూరి హనుమంతరావు ఈ సందర్భంగా అన్నారు. విద్యార్థులకు త్రాగునీటి కోసం మినరల్ వాటర్ అందిఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యాదిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర బట్ట చార్య, వాడు సభ్యులు పైనం నరసింహులు, బాలం కుందు జనార్దన్, కల్లూరు సహదేవ్, బురెడ్డి ప్రభాకర్ రెడ్డి, కల్లూరి కృష్ణ, పులగం మైపాల్ రెడ్డి, గోస్కే సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని నిరసన

- గ్యాస్ ధరలు తగ్గించాలి.. సబ్సిడీ, రేషన్ సరుకులు,
- రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్




**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కొట్పల్లి మండలంలోని ఓగులపూర్ గ్రామంలో మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ మహిళలకు సబ్సిడీతో గ్యాస్ సిలిండర్లు అందించాలని, పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న గ్యాస్ సబ్సిడీ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టంగా అమలు చేసి, రేషన్ బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. మహిళా సంఘాల రుణాలను వెంటనే మాఫీ చేసి, కొత్త రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు ప్రయాణంతో పాటు మహిళలకు హెల్త్ కార్డులు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే మహిళలు పెద్దఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, సుక్కమ్మ, లక్ష్మి, అనసూయ, ఎల్లమ్మ, యాదమ్మ, గౌరమ్మ, బాలమ్మతో పాటు గ్రామానికి చెందిన మహిళలు పాల్గొన్నారు.

# జవుల(బి) గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం



**చట్టం తానూర్ :** నిర్మల్ జిల్లా తానూర్ మండలం జవుల(బి) గ్రామంలో అభివృద్ధి పనులకు ఆదివారం శ్రీకారం చుట్టారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు కాగా, పనులను స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు ఎదురుచూస్తున్న డ్రైనేజీ, సీసీ రోడ్డు సమస్యలకు పరిష్కారం లభించడంతో గ్రామంలో ఆనందం వ్యక్తమైంది. ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైన నిధులతో చేపడుతున్న ఈ పనులు గ్రామాభివృద్ధికి దోహదపడతాయని నాయకులు పేర్కొన్నారు. ముధోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ భోస్లే నారాయణరావు పటేల్ కృషితోనే జవుల(బి) గ్రామానికి నిధులు మంజూరయ్యాయని స్థానిక నాయకులు తెలిపారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న నారాయణరావు పటేల్‌కు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... రోడ్లు, డ్రైనేజీ నిర్మాణంతో గ్రామంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని, ప్రజల ఇబ్బందులు తగ్గుతాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**సర్పంచ్ అమృత అశోక్ గౌడ్**



**చట్టం శివ్వంపేట :** మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడంలో గ్రామస్తులందరూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సర్పంచ్ బసంపల్లి అమృత అశోక్ గౌడ్, అన్నారు. ఆదివారం శివ్వంపేట మండల పరిధిలోని లింగోజిగూడ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మంచినీటి సరఫరా కోసం 470 మీటర్ల పైప్ లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. గ్రామస్తులు పాలకవర్గం సహకారంతో అన్ని విధాలుగా గ్రామాన్ని అభివృద్ధిలోకి తీసుకు వెళ్లడం జరుగుతుందన్నారు. గ్రామ ప్రజల సహకారంతో గ్రామ అభివృద్ధి ముందు వరుసలో ఉండే విధంగా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గన్యా నాయక్, భసంపల్లి అరవింద్ గౌడ్, వార్డు సభ్యులు పోచయ్య, అరుణ్, లలిత నాగమణి, సంతోష్, నాయకులు నాగ్యారీ యాదగిరి, రాయిని రాములు, నర్సింలు దశరథ, రాజు, శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు



**చట్టం, నిర్మల్ ప్రతినిధి** : నిర్మల్ పట్టణంలోని ఆదివారం అంబేద్కర్ భవన్లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ యోగ వేడుకలలో భాగంగా యోగా శిక్షకులు, ప్రతి యోగాసనం యొక్క ఉపయోగం తెలుపుతూ కార్యక్రమానికి హాజరైన వారితో వివిధ రకాల యోగాసనాలు వేయించారు. నేడు ప్రపంచం మొత్తం యోగాను ఆచరిస్తుందని, ప్రజలంతా నిత్యజీవితంలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యోగ సాధనతో ఎన్నో రకాల మొండి వ్యాధులు కూడా నయమవుతాయని అన్నారు. యోగాతో, శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుందని వివరించారు. ప్రతిరోజు కొద్ది సమయం యోగాకి కేటాయించడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు దరిచేరవని తెలిపారు. ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకల్లో డిఇఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, నోడల్ అధికారి సత్యనారాయణరావు, ఇతర అధికారులు, సిబ్బంది, శిక్షకులు, పట్టణవాసులు తదితరులు పాల్గొన్నారు.

## బిచ్కుంద లో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం



**చట్టం బిచ్కుంద :** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని సహజ సిద్ధ యోగాసమితి సభ్యులు పతాంజలి సభ్యుల ఆధ్వర్యంలో మున్నూరు కాపు సంఘములో ఘనంగా జరుపుకున్నారు. యోగా గురువు సంజీవ్ జబ్రే మార్గదర్శనంలో సభ్యులు యోగ సాధన చేశారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు హనుమంత్ సిందే మాట్లాడుతూ నిత్యం యోగ సాధన చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, యువతని యోగ సాధనలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సహజ సిద్ధ యోగ సమితి అధ్యక్షులు దేవిశెట్టి విజయ్ మాజీ అధ్యక్షులు కొలవార్ కుమార్ సెట్ బిఆర్ఎస్ మాజీ శాసనసభ్యులు హనుమంతు సిందే మరియు బిజెపి మాజీ శాసనసభ్యులు అరుణాతార, రచ్చ శివకాంత్, వై శ్రీనివాస్, వాసరే నాగనాథ్ ,ప్రముఖ దంత వైద్యులు గంగా సింగ్, ఆర్ఎంపీ డాక్టర్లు, భాజపా కార్యకర్తలు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్.. మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్య



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలో ఇంటర్మీడియట్ విద్యార్థిని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన ఆదివారం చోటుచేసుకుంది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పొన్నాల గ్రామానికి చెందిన నల్లముతి వైష్ణవి (18) ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో కొన్ని సబ్జెక్టుల్లో విఫలమవడంతో తీవ్ర మానసిక ఆందోళనకు గురైనట్లు సమాచారం. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు ఆమె గది తలుపు లోపల నుంచి గడియ వేసి ఉండటాన్ని గమనించారు. పలుమార్లు పిలిచినా స్పందన లేకపోవడంతో పొరుగువారి సహాయంతో తలుపు తెరిచి చూడగా, గదిలోని కిటికీకి చున్నీతో ఉరివేసుకున్న స్థితిలో కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స కోసం సిద్దిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి, అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విద్యా సంబంధిత ఒత్తిడి, మానసిక ఆందోళన కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తల్లి నిఖిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

## రైతుల ఉసురు పోసుకుంటే ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించలేదు!



**చట్టం బిచ్కుంద :** జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిందే కామారెడ్డి జిల్లా బిచ్కుంద పట్టణంలోని తన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ సమావేశంలో రైతుల సమస్యల పై మాట్లాడారు. పాత విధానంలో రైతుకు అవసరమైన యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటోందని ఆరోపించారు. "దేశానికి అన్నం పెట్టే అన్నదాత ఉసురు పోసుకుంటే ఏ ప్రభుత్వమూ ముందు పడదని" కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కెసిఆర్ హయంలో కేసీఆర్ 9 ఏళ్ల ప్రభుత్వ పాలనలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు బీమా తదితర పథకాలతో రైతులను ఆదుకున్నారని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి రైతులకు మోసము చేయకుండా రైతుల పక్షాన నిలబడి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను వంచించిందని అన్నారు. రైతులకు కౌలు రైతులకు ఎకరానికి 15000 రైతు కూలీలకు 12000 ఇస్తామన్న హామీలు ఏమయ్యాయి అని ప్రశ్నించారు రైతుల బాధలను గమనించి యూరియా యాప్ ను తొలగించాలని పాత పద్ధతిలోనే రైతులకు సరిపడ్డ యూరియా అందివ్వాలని మాజీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు

## ఉచిత కంటి వైద్య శిబిరం



**చట్టం ముప్కాల్** : ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామంలో ఆదివారం 'లక్షణ కంటి' హాస్పిటల్ నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినారు. గ్రామ సర్పంచ్ దాసరి గంగాధర్ చేతులమీదుగా ఉచిత కంటి వైద్య శిబిరంను చేపట్టారు. ఈ శిబిరంలో ప్రముఖ నేత్ర వైద్యులు డా.కరంపూరి శ్రీనివాస్, డా.వేదశ్రీ ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలను అందించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బొంల్లా రవి, పిండి గణేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో ఘనంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణ

**చట్టం - సిద్దిపేట ప్రతినిధి :**

ఆయుష్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కే.హైమావతి నేతృత్వంలో ఆదివారం ఉదయం సిద్దిపేట క్రికెట్ గ్రౌండ్ లో 12 వ అంతర్జాతీయ యోగ కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు, సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఎన్సిసి విద్యార్థులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులు ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కలకత్తాలో నిర్వహించిన యోగ కార్యక్రమంలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన సందేశాన్ని స్క్రీన్ పై పై ప్రదర్శించారు. అనంతరం యోగ గురువులు ఈ యోగ కార్యక్రమానికి హాజరైన వెయ్యి మందికి పైగా ప్రజలతో గంటసేపు వివిధ యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు మాట్లాడుతూ: శరీరాన్ని ప్రేమిస్తూ నిత్య యవ్వనంగా ఉండాలంటే రోజూ యోగ చేయాలని చూచించారు. పని ఒత్తిడి మూలంగా చాలామంది ఉదయం త్వరగా లేచి ఎలాంటి శారీరక వ్యాయామాలు చేయడం లేదని ఆరోగ్య సంరక్షణ కోసం తప్పనిసరిగా ఎంత పని ఒత్తిడి ఉన్న ఉదయం 5 గంటలకు లేచి యోగ చెయ్యాలన్నారు. స్ట్రాంగ్ మైండ్ ఇన్ స్ట్రాంగ్ బాడీ అని ప్రఖ్యాత తత్వవేత్త అరిస్టాటిల్ ఎప్పుడో ఆరోగ్య సంరక్షణ కోసం చెప్పాడని అన్నారు. ప్రతిరోజు యోగా చేస్తే వయస్సు ఎరిగిన శరీరక ఉత్తేజాన్ని నిలుపుకోగలమని తెలిపారు.శారీరక శ్రమ లేకపోవడం ఎప్పుడు సెల్ ఫోన్ చూడడం మూలంగా చిన్నపిల్లలలో ఒబేసిటీ పెరుగుతుందని పిల్లలకు కూడా తప్పనిసరిగా యోగ చేయించాలని, సెల్ఫోన్ కు దూరంగా ఉంచాలని సూచించారు. శరీర ఆకృతి బాగుంటే ఎదుటివారి మన పైన పాజిటివ్గా ఉంటారని, నిత్యం యోగ చేస్తూ ఆరోగ్యవంతమైన అలవాట్లను పాటిస్తూ ఉద్యోగులు అయితే రిటైర్ అయిన తర్వాత కూడా కుటుంబంతో సంతోషంగా గడిపేలా ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోడీ లాంటి రాజకీయ నాయకులు 75 సంవత్సరాల లో కూడా ఎంత స్ట్రాంగ్ గా ఉన్నారంటే నిత్యం యోగ, ఆరోగ్యవంతమైన సాత్విక ఆహారం తీసుకోవడం కారణమని చెప్పారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ: ఋషులు అందించిన భారతదేశ అతి ప్రాచీన ఆరోగ్య కార్యక్రమం యోగ అని అన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తం యోగా కార్యక్రమం విస్తృతంగా ప్రచారం పొంది ఆచరిస్తున్నారని, యోగాకు పుట్టిల్లు అయిన భారత దేశంలో దాని ప్రభావం కోల్పోకుండా ప్రజలు తప్పకుండా ఆచరించేలా యోగ కార్యక్రమాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లడానికే ఈ అంతర్జాతీయ యోగ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించడం జరిగిందని తెలిపారు. నేను ప్రతిరోజు ఒక గంట యోగ చేస్తానని మీరు కూడా ప్రతిరోజు యోగాను దినచర్యగా పాటించి ఆరోగ్యంగా జీవించాలని, యోగ ప్రభావం మనసు, శరీరం, ఆత్మ ను ఉత్తేజం చేస్తుందని అన్నారు. రొటీన్ గా కాకుండా ఇష్టంగా యోగ అభ్యసనం చెయ్యాలనీ, యోగతో పాటు సాత్వికాహారం తీసుకొని ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యోగదే నోడల్ అధికారి ఆయుష్ డాక్టర్ ఉమాదేవి, సిద్దిపేట ఆర్డిఓ సదానందం తదితరులు పాల్గొన్నారు.





## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి
# యోగాయే శ్రీరామరక్ష



**చట్టం న్యూస్ లింగంపేట్ :**

శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఒక దివ్యౌషధం. ఒత్తిడి లేని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగాయే శ్రీరామరక్ష అని మండల బీజేపీ అధ్యక్షుడు బొల్లారం క్రాంతికుమార్ అన్నారు. భారతీయ జనతా పార్టీ లింగంపేట్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బిజెపి నాయకులు యోగాసనాలు వేశారు. అనంతరం మండల బిజెపి అధ్యక్షులు బొల్లారం క్రాంతి కుమార్ మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఒక దివ్యౌషధం. ఒత్తిడి లేని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగాయే శ్రీరామరక్ష అని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుని, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలి నేటి సమాజంలో మనం తీసుకున్నటువంటి ఆహార ఉత్పత్తులు రసాయనాల చేత తయారు చేస్తూ ఆఖరికి పంటను కూడా రసాయనాలా చేత పండిస్తున్న కారణంగా వంద సంవత్సరాల బతకాల్సినటువంటి వ్యక్తి 60 సంవత్సరాలు కూడా బతకలేని ఈ రోజుల్లో మళ్లీ పురాతన రోజులు తీసుకురావాలంటే ప్రతి ఒక్కరూ వారి జీవితంలో యోగాను పరిచయం చేసుకోవాల్సిందేనని అన్నారు. రోజు యోగా చేయడం చేత ఆరోగ్యం మరియు ఆయుషు ఈ రెండిటిని వారి జీవితంలో పొందే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ రోజు యోగాసనాలు చేసి వారి జీవితంలో వెలుగులు నిప్పుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుల జక్సని దత్తు రాములు, మండల ప్రధాన కార్యదర్శి ఆకుల విష్ణువర్ధన్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు అంధ్యాల ఉదేశ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు రాజారాం బాలయ్య, బి.ఎం.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ది శివయ్య, లింగంపేట పట్టణ అధ్యక్షులు నరేష్ భగవాన్, లింగంపేట కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి రాజారాం రమేష్, సీనియర్ నాయకులు చేపూరి పోశెట్టి, శివయ్య గారి నవీన్ కుమార్, సంతోష్ రెడ్డి, రాజారామ్ రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామం మల్కాపూర్‌లో 406వ వారం స్వచ్ఛభారత్



**చట్టం, తూప్రాన్:**

తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో 406వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామంలోని రాక్ గార్డెన్ పరిసరాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. అలాగే గ్రామంలోని సీసీ రోడ్లను చీపుర్లతో ఊడ్చి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ, వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామస్థులు తమ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. గ్రామాన్ని నిరంతరం స్వచ్ఛంగా, ఆరోగ్యవంతంగా ఉంచడమే లక్ష్యంగా పంచాయతీ పాలకవర్గం, మెకిన్ యువత కలిసి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వామి, వార్డు సభ్యుడు జిన్న కృష్ణ, మెకిన్ యువత సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## పాల్వంచ ఉద్యమకారుల ఆధ్వర్యంలో
# జయశంకర్‌కు ఘన నివాళి

**పాల్వంచ, చట్టం:-**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర సాధన కొరకు తన జీవితాన్ని పణంగా పెట్టి, వివాహాన్ని మానుకొన్న మహోన్నత ఉద్యమకారుడని పాల్వంచ ఉద్యమకారుల కొనియాడారు. ఆదివారం జయశంకర్ వర్ధంతిని పాల్వంచ ఉద్యమకారుల ఆధ్వర్యంలో దమ్మపేట సెంటర్లో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ జయశంకర్ తన అనుభవాన్ని క్రోడీకరించి, తెలంగాణాకు ఆంధ్రా, మద్రాస్ ఉద్యోగుల వలన జరుగుతున్న అన్యాయాన్ని విద్యావంతులకు తెలియజెప్పి ఉద్యమకారులుగా తయారుచేసారని గుర్తుచేసారు. 1919 లో నిజాం నవాబులు తీసుకవచ్చిన ముల్కీ నిబంధనలను ఆధారంగా చేసుకొని స్థానికేతర ఉద్యోగులు వెళ్లిపోవాలని ఉద్యమం చేసారన్నారు.ఆనాడు 1952 లో జరిగిన ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ ఉద్యమంలో పోలీసుల కాల్పుల్లో ఎనిమది మంది ఉద్యమకారులు అమరులు కాగా ఈయన ఒక్కరే మిగలడం విశేషమన్నారు.ఈ ఉద్యమ స్పూర్తి ని ప్రజల్లో రగిలించి మా ఉద్యోగాలు మాకే కావాలని నినదించి 1969 ఉద్యమానికి జీవం పోసారు. ఈ ఉద్యమాన్ని ఆనాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి, హోంమంత్రి జలగం వెంగళరావు లు ఉద్యమాన్ని అణచివేయుటకు జరిపిన పోలీసుల కాల్పుల్లో 369 మంది విద్యార్థులు అమరులయ్యారన్నారు. ఆనాటి ఉద్యమాన్ని చల్లాబర్చుటకు మర్రి చెన్నారెడ్డిని ముఖ్యమంత్రి ని చేసారన్నారు, ఐనా తెలంగాణా నిరుద్యోగుల ఆశయాలు నెరవేరలేదని వెల్లడించారు. కాలం గడుస్తున్నా కొద్ది ఆంధ్రులు నీళ్లు, నిధులను, నియామకాలను తరలించపోయి అనుభవించుట వలన కలత చెందిన తెలంగాణా వాదులు తిరిగి 1996 నుంచి ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను తెలియచేసి 2001 నుంచి 2011 వరకు సకల జనులు కలసి తిరుగులేని ఉద్యమం నడపగా, 1200 తెలంగాణా ఉద్యమకారులు అమరలు అవగా కాంగ్రెస్ ప్రభుత్వం 02.06.2014 న తెలంగాణా రాష్ట్రం ప్రకటించిందని గుర్తుచేసారు. నేడు 100% నిధులు, నీళ్లు,నియాకాలను కాంట్రాక్టు పనులను తెలంగాణా నిరుద్యోగులకే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఉద్యమకారులు బరగడి దేవదానం, శ్రీ పాద సత్యనారాయణ, షేక్ నబీ సాహెబ్, శనగ రామచందర్ రావు, శనగ వెంకటేశ్వర్లు, వీరాచారి, మణి, రాము తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ లైటింగ్ రోడ్డు పనులు ప్రారంభించాలని బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

**రోడ్డుపై నీటిమడుగులో కూర్చుని నిరసన తెలియజేసిన మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే**



**చట్టం బిచ్కుంద:** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలోని సెంట్రల్ లైటింగ్ రోడ్డు పనులు ప్రారంభించాలని బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే రోడ్డుపై నీటిమడుగులో కూర్చొని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే సాంక్షన్ అయిన రోడ్డు పనులు కాంగ్రెస్ పాలనలో రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికిని పూర్తికాక దుస్థితి నీ ఎదుర్కోవడానికి గల కారణం కాంగ్రెస్ పాలకులకు సెంట్రల్ లైటింగ్ రోడ్డు పనుల పైన చిత్తశుద్ధి లేకపోవడమేనని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలకులకు ప్యాకేజీల మీద ఉన్న శ్రద్ధ పాలనపై లేదని ప్రజాజీవనం అస్తవ్యస్తమవుతున్నప్పటికిని కాంగ్రెస్ నాయకులు చలిమంట కాల్చుకుంటున్నారని నాకేంటి, మాకేంటి అన్న ధోరణిలోనే కాంగ్రెస్ చోటామోటా నాయకులు అందరూ ఎవరి ధీమాలో వారు ఉన్నారని ప్రజాల ఇబ్బందుల గురించి వారికి చిత్తశుద్ధి లేదని ఆయన అన్నారు. కందర్ పల్లి నుండి మద్దెల చెరువు వరకు ఏడు మీటర్ల రోడ్డు వెడల్పుతో పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికిని పుల్కల్ గ్రామ శివారు వరకు చేసి ఎందుకు అర్థాంతరంగా నిలిపివేశారు కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. పూర్తిస్థాయిలో గుంతలమయమైన రహదారిపై ప్రజలు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొని జరగరాని సంఘటనలు జరిగితేనే స్పందిస్తారా అప్పటివరకు మొద్దు నిద్రలో ఉంటారా అంటూ ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. వారం రోజుల వ్యవధిలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేనట్లయితే రోడ్డు పక్కన టెంట్ వేసి ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల స్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వర్షా లు కురవాలని గ్రామదేవతలకు జలాభిషేకం



**చట్టం, బాసర :** నిర్మల్ జిల్లా బాసర మండల పరిధిలోని కౌట గ్రామంలో ఆదివారం గ్రామస్తులు గ్రామదేవతలకు గోదావరి నది జలభిషేకం చేపట్టారు. ఈ సందర్భంగా మృగశిర కార్తె వచ్చి 15 రోజులు గడిచిన మెరుగు కార్తి వెళ్లి, ఆరుద్ర కార్తె వచ్చినప్పటికీ ఈపాటికి రైతులు తమ తమ పంట చేన్లో విత్తనాలు వేసి మొలికిస్తే చరణంలో ఇప్పటివరకు వరుణుడు ముఖం చాటేయడంతో వాన జాడ లేకపోవడంతో కనిష్ట ఉష్ణోగ్రత ఏర్పడడం వలన ఎండాకాలం మాదిరిగా ఎండలు ఉండడంతో కు వరుణ దేవా కరుణించవా అంటూ వానమ్మ వానమ్మ ఒక్కసారైనా వచ్చి పోవమ్మా గంగా నీకు శరణమే ఘనమైన పూజలే అంటూ పాటలు పాడుతూ ప్రత్యేక గురుబోధ భజనలు చేస్తూ పుణ్య గోదావరి నదిలో స్నానాలు ఆచరించి అక్కడ ప్రత్యేక పూజలు చేపట్టి గోదావరి నది జలాన్ని తెచ్చి గ్రామంలో గల లక్ష్మి పోచమ్మ హనుమాన్ మందిరం తో పాటు దత్తాత్రేయ మందిరంలో జలభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా రైతులు తమ వేదనతో మాట్లాడుతూ... ప్రత్యేక నైరుతి రుతుపవనం ఏర్పడి సోమవృద్ధిగా వర్షాలు పడి ఈ సంవత్సరం రైతులకు దిగుబడి కలిగించే విధంగా సమవృష్టిగా వర్షాలు కురవాలని గోదా గోవు పశుపక్షి అందరికీ మంచిదని భారతదేశానికి రైతే రాజు రైతు పంట పండించకుంటే ఏ అధికారైన రాజకీయ నాయకుడైన ఆహారం తినకుండా ఉండలేరని స్పష్టంగా చెప్పవచ్చు దీనితో ఈ కార్యక్రమంలో గ్రామంలోని కులమత బేధం లేకుండా యువకులు మహిళలు అందరూ సామూహికంగా కలిసి గోదావరి నది జలానికి వెళ్లారు.

## కోనేరు శంశాంక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్ల పంపిణీ



**చట్టం నసురుల్లాబాద్ :** కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలం రాములగుట్ట గ్రామ యువకులకు కోనేరు శంశాంక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఎన్నారై కోనేరు శంశాంక్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సున్నం సాయిలు యువకులకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడలను ప్రోత్సహించేందుకు కోనేరు శంశాంక్ ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రుద్రూర్ మండల బీజేపీ అధ్యక్షుడు అలపాటి హరికృష్ణ, కోటగిరి మండల అధ్యక్షుడు నవీన్, బీజేపీ నాయకులు అరిగే నారాయణ, గోపి, శ్రీకాంత్, గ్రామ పెద్దలు, యువకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతలకు బోనాలు ప్రత్యేక పూజలు



**చట్టం నసురుల్లాబాద్:** కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామంలో గ్రామస్తులు, గ్రామంలోని ఉన్న గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. గ్రామస్తులు గ్రామ పెద్దలు మహిళలు భారీ సంఖ్యలో బోనాలతో గ్రామ దేవతల వద్దకు చేరుకొని ప్రత్యేక ముక్కులు చెల్లించి, అమ్మవారికి నైవేద్యం కొబ్బరికాయలు పూలు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, గ్రామ సర్పంచ్ ఎడ్ల లలిత శంకర్, గ్రామ పెద్దలు మహిళలు యువతీ యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

CHATTAM NEWS
చట్టం సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

# డాన్ టు డస్క్ కార్యక్రమాలతో సేవా కార్యక్రమాలు నిర్వహించిన వాసవి క్లబ్

**చట్టం అశ్వరావుపేట :**

వాసవి క్లబ్ KCGF దమ్మపేట, పట్వారిగూడెం, బుగ్గపాడు, సత్తుపల్లి శాఖల ఆధ్వర్యంలో ఆదివారం "డాన్ టు డస్క్" కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. సమాజ సేవ లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమాలను అమ్మవారి దర్శనంతో ప్రారంభించారు. అనంతరం KCGF సభ్యత్వ నమోదు, కొత్త సభ్యుల చేర్పు, హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఐకాన్ ప్రోగ్రామ్‌కు సభ్యుల నమోదు చేపట్టారు. వృద్ధాశ్రమంలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసేందుకు సిద్ధంగా ఉన్న దాతల వివరాలను అందుబాటులో ఉంచారు. అలాగే అత్యవసర సమయంలో ప్రజలకు ఉపయోగపడే ఎమర్జెన్సీ ఫోన్ నంబర్ల జాబితాను ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు. వినాయకపురం సమీపంలోని గోశాలకు 50 కిలోల పశు దాణా అందజేశారు. సత్తుపల్లి, దమ్మపేట, బుగ్గపాడు ప్రాంతాల్లోని గోశాలలకు కూడా దాణా పంపిణీ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులను సాలువాలతో సన్మానించి, విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఐదుగురు వాలంటీర్ల జాబితాను రూపొందించి సేవా కార్యక్రమాలకు సిద్ధం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలకు రక్షణ గార్డులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ వియన్ సిల్వర్ స్టార్ పోలిశెట్టి శివకుమార్ హాజరయ్యారు. గౌరవ అతిథిగా సిల్వర్ స్టార్ KCGF ధారా మల్లికార్జునరావు (IPC) పాల్గొన్నారు. కార్యక్రమంలో రీజన్ చైర్‌పర్సన్ వియన్ కపుల్ పోకూరి కృష్ణప్రసాద్, జోన్ చైర్మన్ వియన్ KCGF మరియు మహాత్మా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జల్లిపల్లి దేవరాజు, వాసవి క్లబ్ అధ్యక్షుడు సమయమంతుల మోహన గంగాధర్ రావు, పట్వారిగూడెం అధ్యక్షుడు సేగు కుమార్ రాజా, మాజీ జోన్ చైర్మన్ పరిటాల చక్రధరరావు, దమ్మపేట అధ్యక్షుడు బచ్చు రవి, బుగ్గపాడు అధ్యక్షురాలు దోపగుంట శ్రావణి, సత్తుపల్లి అధ్యక్షుడు దుర్గారావు, దేవస్థానం మాజీ అధ్యక్షుడు ముత్తా సుమాకర్‌తో పాటు వాసవి క్లబ్ సభ్యులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.




## మైనారిటీ సెల్ అధ్యక్షుడు రషద్‌కు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సన్మానం



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** నూతనంగా సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా నియమితుడైన రషద్ ఆదివారం భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూజల హరికృష్ణ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి రషద్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీ వర్గాల సంక్షేమం కోసం కృషి చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీని జిల్లా వ్యాప్తంగా మరింత బలోపేతం చేసే దిశగా పనిచేయాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. రషద్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, జిల్లా వ్యాప్తంగా మైనారిటీ వర్గాలను కాంగ్రెస్ పార్టీకి మరింత చేరువ చేసేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట యూత్ కాంగ్రెస్ నాయకుడు గాయశుద్దీన్‌తో పాటు ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జీవితంపై విరక్తి చెంది యువకుడు ఆత్మహత్య



**చట్టం న్యూస్ లింగంపేట్ :** తాను దుబాయ్ వెళ్లలేక ఇంట్లో కుటుంబ సభ్యులకు సమాధానం చెప్పలేక సతమతం అవుతూ జీవితంపై విరక్తి చెంది యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన లింగంపేట్ మండలంలోని మోతే గ్రామంలో జరిగినట్లు ఎస్సై దీపక్ కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి, మోతే గ్రామానికి చెందిన గుండ్రెడ్డి రంజిత్ రెడ్డి (23 ) రెండుసార్లు దుబాయ్ వెళ్లి వచ్చాడు అయితే మరోసారి అతను దుబాయికి వెళ్ళేది ఉండే, అయితే ఈసారి దుబాయి వెళ్ళను నాకు ఇష్టం లేదంటూ ఇంట్లో తెలియజేసాడు కానీ కుటుంబ సభ్యులు ఆర్థిక అవసరాలు రిత్యా ఈసారి ఒక్కసారి దుబాయ్ వెళ్లి రా వెళ్లి వస్తే మనం ఇల్లు కట్టుకుందాం అని కుటుంబ సభ్యులు అతన్ని దాముదయంచారు. అయితే కుటుంబ సభ్యులు చెప్పిన అతను ఏ సమాధానం చెప్పలేదు. నేను దుబాయ్ వెళ్ళను అని అంటే కుటుంబ సభ్యులు భయపడతారని కుటుంబ సభ్యులకు చెప్పలేక తనకు తాను బాధపడుతూ జీవితం విరక్తి చెంది తన వ్యవసాయ క్షేత్రంలో టేకు చెట్టుకు డ్రిప్పు పైపుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోను లిఫ్ట్ చేయలేడు అయితే వ్యవసాయ క్షేత్రంలో స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా రంజిత్ రెడ్డి టేకు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని అన్న గుండ్రెడ్డి రామ్మోహన్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

## సీఏలో ఉత్తమ ఫలితం సాధించిన విద్యార్థికి సన్మానం



**చట్టం, భైంసా :** నిర్మల్ ముధోల్ మండలం అష్ట గ్రామానికి చెందిన విద్యార్థి జాదవ్ శివం కు ఇటీవల విడుదలైన CA ఫలితాలలో భాగంగా రాష్ట్రంలో ఉత్తీర్ణత సాధించిన శుభ తరుణంలో విద్యార్థికి ఘనంగా శాలువా పూలమాలతో సత్కరించి మిఠాయి తినిపించిన అభినందించిన తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సభ్యులు, ప్రముఖ వ్యాపారవేత్త, ప్రజా ట్రస్ట్ చైర్మన్, ఆదివారం భైంసా పట్టణము భైంసా జీన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలో ముధోల్ మాజీ ఎంపీపీ జాదవ్ సుభాష్ పటేల్ కుమారుడు జాదవ్ శివం ఈ ఘనత సాధించడం పట్ల ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ మీ యొక్క విద్య ద్వారా పలువురి పేద ప్రజలతో పాటు జిల్లాలో అనేక కార్యక్రమాల్లో మీ ప్రతిభ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అభిమానులతో పాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతలకు గంగా జలంతో అభిషేకాలు



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఆరు పంతల కాపు సంగం సభ్యులు, సర్వసమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం రోజు పట్టణ కేంద్రంలోన గల గ్రామ దేవతలకు గంగా జలంతో అభిషేకాలు చేశారు. రైతులు నిన్నటి రోజు రాత్రి ఆర్మూర్ నుండి బయలుదేరి పోచంపాడ్ గోదావరి గంగా వద్ద నిద్రించి మరుసటి రోజున నేటి ఉదయం బ్రహ్మ ముహూర్తంలో నిద్ర లేచి గంగా నదిలో స్నానం ఆచరించి ప్రత్యేక పూజలు చేసుకొని, ప్రత్యేకంగా అలంకరించుకున్న (బిందెలలో) సర్వలో గంగా నీళ్లను తీసుకొని వచ్చి ఉదయం ఆర్మూర్ గ్రామ పొలిమేరలో వేచి ఉంటారు. సర్వసమాజ్ అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు, ఆరు పంతల రైతు సంఘాల అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు, ఊరడి వాళ్ళు, ద్యావతి వాళ్ళు డప్పు వాయిద్యాలతో వెళ్లి గంగా జలంతో ఉన్న వారి పాదాలను కడిగి, గంగా జలం సర్వలకు పూజలు చేసి పోచమ్మ తల్లి, వద్దకు ఊరేగింపుగా తీసుకొని వచ్చి పోచమ్మకు గంగా జలంతో అభిషేకం చేసి అనంతరం ఆర్మూర్ పట్టణంలో గల అన్ని గ్రామ దేవతల దేవాలయంలకు వెళ్లి దేవతలకు గంగా జలంతో అభిషేకలు చేశారు. జేష్ఠ మాసం, గ్రిష్మ ఋతువులో అభిషేకాలు చేయడం ఆనవాయితీగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. వర్షాలు సకాలంలో మంచిగా కురిసి రైతులు పాడి పంటలు మంచిగా పండి, ప్రజలు సుబిక్షంగా ఉండాలని రైతులు గ్రామ దేవతలను కోరుకుంటారు. ఈ ఏర్పాట్లను సర్వసమాజ్ అధ్యక్షులు కొట్టల సుమన్, ఆరు పంతల అధ్యక్షులు మగ్గిడి రాజేశ్వర్, కలిగోట గంగాధర్, బొల్లు పోతన్న, మల్లయ్య, డబ్బా లింగం, భూపతి, పెదకాపులు ఏర్పాట్లను చూసి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ కారులు జూన్ 28లోగా తమ దరఖాస్తులను అందజేయాలి



**చట్టం - సిద్దిపేట, ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం లో పాల్గొన్న ఉద్యమ కారులు జూన్ 28 లోగా తమ దరఖాస్తులను అందజేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. టీజేఏసీ చైర్మన్, తెలంగాణ ఉద్యమ కారుల సంఘం నాయకుడు జి. పాపయ్య అధ్యక్షతన సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో సంఘం సమావేశం జరిగింది.. సమావేశం లో సంఘం ప్రతినిధులు జి. తిరుపతి రెడ్డి కె. రంగాచార్య, పెద్ది రాజు, ఖమ్మంపల్లి యాదగిరి, కర్రోళ్ల బాబు,కూతురు రాజి రెడ్డి,విక్రమ్ రెడ్డి, శ్రీహరి, అశ్వాక్, సిద్దంకి యాదగిరి, కొండి మల్లారెడ్డి, మహమూద్ పాషా, డబ్బికారి సురేందర్,రామలింగా రెడ్డి, బోరెడ్డి మధుసూదన్ రెడ్డి, లక్ష్మారెడ్డి స్వరూప, విజయ, డప్పుబాబు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 సంవత్సరాలు జరిగిన ఉద్యమంలో భాగస్వాములైన ఉద్యమకారులు తమ తమ సంఘాల ప్రతినిధులకు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. టీజేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమంలో భాగస్వాములు అయిన. విడిగా ఉద్యమాలు నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయ, జర్నలిస్టుల రచయితల, కవుల, కళాకారుల, ఆర్టీసీ, ఉద్యుత్, రైతు,విద్యార్థి దళిత, బహుజన, మహిళా సంఘాల, ప్రజాసంఘాల, డాక్టర్ల, న్యాయవాదులసంఘాల వారికి విడివిడిగా బాధ్యులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.. వారికి తమ దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.. రాజకీయ పార్టీల ఉద్యమకారులు తమ తమ పార్టీల నా యకత్వాలకు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.. దరఖాస్తుతో పాటు ఉద్యమంలో తాము పాల్గొన్న ఆధారం జతచేయాలని తెలిపారు.. జిల్లా లోని గజ్వేల్, దుబ్బాక, చేర్యాల, హుస్నాబాద్, బెజ్జంకి ప్రాంతాల ఉద్యమకారులు స్థానికంగా దరఖాస్తు లను తయారు చేసి స్థానిక టీజేఏసీ ప్రతినిధులకుగాని, తెలంగాణ ఉద్యమ కారుల సంఘాల ప్రతినిధులకు గాని అందజేయాలని తెలిపారు. జూన్ 28 తరువాత దరఖాస్తులు స్వీకరించబడ వని సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు.

## రైతులకు వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ ప్రభుత్వం : మండల అధ్యక్షుడు నవీన్



**చట్టం పోతంగల్/కోటగిరి :**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుద్దాం నవీన్, నాయకుడు హకీమ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే ధాన్యం కొనుగోలు చేస్తామని, అదనంగా ఒక్క గింజ కూడా కొనబోమని ప్రకటించడం రైతుల పట్ల దారుణమైన అన్యాయమని వారు ఆరోపించారు. ఈ నిర్ణయం రైతుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే చర్యగా అభివర్ణించారు. వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టి రైతుల జీవనోపాధిని దెబ్బతీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ ఏర్పాటుకు ముందు ఉన్న పరిస్థితులను మళ్లీ తీసుకువస్తోందని విమర్శించారు. సమైక్య రాష్ట్రంలో సాగునీటి కొరత, విద్యుత్ సమస్యలు, కాలిపోయే మోటార్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రైతు సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని అనేక పథకాలు అమలు చేశామని పేర్కొన్నారు. మిషన్ కాకతీయ ద్వారా వేలాది చెరువులను పునరుద్ధరించి భూగర్భ జలాలను పెంచారని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించారని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా దక్షిణ తెలంగాణ రైతుల సాగునీటి సమస్యలకు పరిష్కారం చూపే ప్రయత్నం జరిగిందన్నారు. అదేవిధంగా రైతు బంధు, రైతు బీమా వంటి పథకాల ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పించారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. రైతు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు విధానాన్ని పునఃసమీక్షించి, అవసరమైనంత మేర పంటను కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## మొగుళ్లపల్లిలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం




**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు, 10వ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సెంథిల్ రామదురై, పరిపాలనాధికారి కల్నల్ రవి సునారే, జిల్లా విద్యాశాఖ అధికారుల సూచనల మేరకు ఎన్సీసీ అధికారి గుండెల్లి రాజయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎన్సీసీ క్యాడెట్లు, ఉపాధ్యాయులు కలిసి పాఠశాల ఆవరణలో వివిధ యోగాసనాలు నిర్వహించారు. అనంతరం మాట్లాడిన ఎన్సీసీ అధికారి రాజయ్య, యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద అని తెలిపారు. శరీరం-మనసు, ఆలోచన-ఆచరణ, ప్రకృతి-మానవుడి మధ్య సమతుల్యతను సాధించడమే యోగ ప్రధాన లక్ష్యమని వివరించారు. ప్రతి సంవత్సరం జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని, 2014లో ఐక్యరాజ్యసమితిలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రతిపాదనకు 177కు పైగా దేశాలు మద్దతు తెలిపాయని గుర్తుచేశారు. ఈ ఏడాది యోగా దినోత్సవం "ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగ" (Yoga for Healthy Ageing) అనే అంశంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెరుగుతున్న వయస్సులో ఆరోగ్యం, రోగనిరోధక శక్తి, స్వావలంబనను పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు భాగ్యశ్రీ, ఉపాధ్యాయులు సురేందర్, అనిల్ కుమార్, కళ్యాణి, కుమారస్వామి, రాజు, ప్రవీణ్, పద్మ, విజయభాస్కర్, శ్రీకళ, మజార్‌తో పాటు ఎన్సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

## యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి

**లేదంటే రైతుల తరపున ఉద్యమం : అంజిరెడ్డి**



**చట్టం, నసురుల్లాబాద్ :** కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు, కామారెడ్డి జిల్లా మాజీ రైతు సమన్వయ అధ్యక్షుడు అంజిరెడ్డి రాష్ట్ర రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించారు. వ్యవసాయ రంగంలో యూరియా పంపిణీ కోసం అమలు చేస్తున్న యాప్ కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో రైతుల తరపున భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నరసింహులు గౌడ్, టేకుర్ల సాయిలు, లక్ష్మణ్, భూమయ్య, సాయిలు, బాబు, అంబర్ సింగ్, చందర్, మొగులయ్య, అనిల్ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఓవర్ లోడ్, ఫిట్నెస్ లేని 9 వాహనాలు సీజ్

**ఎంవీఐ డిటివో శ్రీకాంత్ చక్రవర్తి అద్వర్యంలో ప్రత్యేక వాహన తనిఖీలు**



**చట్టం, తూప్రాన్:** మెదక్ జిల్లా తూప్రాన్ డివిజన్ పరిధిలో ట్రాన్స్పోర్ట్ అధికారి ఎంవీఐ మెదక్ డిటివో శ్రీకాంత్ చక్రవర్తి ఆధ్వర్యంలో తమ సిబ్బంది తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆదేశాల మేరకు వాహనాలు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. శనివారం అర్థ రాత్రి నుండి తెల్లవారు వరకు తొమ్మిది వాహనాలు సీజ్ చేసి తూప్రాన్ పోలీసు స్టేషన్ Siva తరలించారు. ఓవర్ లోడ్, ఫిట్నెస్ లేని తొమ్మిది వాహనాలు సీజ్ చేసిన అధికారులు. ఎంవీఐ డిటివో శ్రీకాంత్ చక్రవర్తి మీడియా తో మాట్లాడుతూ ఓవర్ లోడ్ మరియు నాన్ పేమెంట్ , ఫిట్నెస్ లేని వాహనాలు తిరుగుతున్నాయని ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించి పట్టుకున్నామని తెలిపారు. ఎవరైనా ఓవర్ లోడ్ తో రోడ్డుపై తిరిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## 1998–99 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని మెడికల్ భవనంలో ఆదివారం రోజు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 199899 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరికి విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులకు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పటి చిన్ననాటి జ్ఞాపకాలను, గత మధురస్మృతులను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో 199899 సంవత్సరం పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని రాంనగర్ 15వ వార్డులో ఆదివారం రోజు ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించిన కాలనీవాసులు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గంగ మోహన్ చక్రు, పట్టణ కాంగ్రెస్ నాయకులు జిమ్మీ రవి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు నర్సింలు, హనుమాన్లు, మహేష్, భోపాల్, లింబాద్రి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి ని తీవ్రస్థాయిలో విమర్శించిన ఎంపీ రఘునందన్ రావు



**చట్టం, తూప్రాన్:** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీలో పర్యటించిన ఎంపీ రఘునందన్ రావు సీఎం రేవంత్ రెడ్డి ని తీవ్ర స్థాయిలో విమర్శించారు. రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో వడ్లు కొనడం చేతగాక, సన్న వడ్ల కు మద్దతు ధర ఇవ్వలేక కేంద్ర ప్రభుత్వం పై నిందలు మోపే కార్యక్రమం మొదలు పెట్టిందన్నారు. అవ్వ బువ్వ ఉడికింద అని రెండు మెతుకులు వత్తి చూస్తే ఎలా తెలుస్తుందో, అలానే కాంగ్రెస్ పాలన తెలిసి పోతోందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ సీజన్ కు 50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేయమని ఇండెంట్ ఇస్తే 50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కావాలంటే 80 నుండి 90 లక్షల వడ్లు కావాలి. కానీ ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఎన్ని వడ్లు దంచితే ఎన్ని బియ్యం వస్తాయో తెలియదు ఈ రవ్వంత రెడ్డికి అంటూ కామెంట్ చేశారు. రేవంత్ రెడ్డేమో ఇప్పటికి 70 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేశామని అంటాడు. ఎన్ని వడ్లు దంచితే బియ్యం ఎన్ని వస్తాయో తెలువనోడు ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి అంటూ కామెంట్ చేశారు. వడ్లు ఎన్ని కొనాలో లెక్కలు తెలియక, కిషన్ రెడ్డి ఇంటిముందు వడ్లు పోస్తామంటాడు అని ఎద్దేవా చేశారు. ఆ సివిల్ సప్లై మంత్రి ఏమి చేస్తుండో అర్థం కాదు అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ చందా అశోక్, రామ్మోహన్ గౌడ్, బీజేపీ మున్సిపల్ ప్రెసిడెంట్ బుమన్నగారి జానకిరామ్ గౌడ్, నత్తి మల్లేష్, సంఖ్యా యాదగిరి, మంకిడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా ఈ నెల 23న 'చలో సచివాలయం'



**చట్టం నిర్మల్ ప్రతినిధి :** రాష్ట్రంలోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో కొనసాగుతున్న అక్రమ ఫీజుల వసూళ్లు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంల బలవంతపు విక్రయాలకు వ్యతిరేకంగా ఈ నెల 23న నిర్వహించనున్న 'చలో సచివాలయం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) నిర్మల్ జిల్లా కార్యదర్శి నామత్కర్ నవీన్ పిలుపునిచ్చారు. ఒక ప్రకటనలో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలను తమ వద్ద నుంచే కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నాయని ఆరోపించారు. విద్యారంగంలో జరుగుతున్న అక్రమాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించిన ఆయన, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**యూఎస్ఎఫ్ఐ ప్రధాన డిమాండ్లు**

ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అక్రమ ఫీజుల వసూళ్లను వెంటనే నిలిపివేయాలి.
పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంల బలవంతపు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలి.
విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ)ను సమర్థవంతంగా అమలు చేయాలి.
విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలి.
ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలి.
ఈ నెల 23న జరిగే 'చలో సచివాలయం' కార్యక్రమంలో విద్యార్థులు, యువజనులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నామత్కర్ నవీన్ కోరారు.

# యోగాతో ఒత్తిడికి ఉపశమనం.. ఆరోగ్యానికి భరోసా : అంబర్ కిషోర్ ఝా

**చట్టం రామగుండం :**

నేటి జీవన విధానంలో మనిషి అనేక ఒత్తిళ్లకు గురవుతున్నాడని, యోగా ద్వారా వాటి నుంచి ఉపశమనం పొందవచ్చని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ మైదానంలో యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్, అధికారులు, సిబ్బందికి యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. యోగా అనేది ఒకరోజు నిర్వహించే కార్యక్రమం కాదని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాల్సిన ఆరోగ్య సాధనమని పేర్కొన్నారు. యోగా చేయడానికి ప్రత్యేకమైన పరికరాలు గానీ, ఇతరుల సహకారం గానీ అవసరం లేదని, వ్యక్తిగత నిబద్ధత, సంకల్పం ఉంటే సరిపోతుందని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, మంచి ఆరోగ్యం మనిషికి అత్యంత విలువైన ఆస్తి అని పేర్కొన్నారు. జీవితంలో ఎంతటి ఉన్నత స్థానాలు సాధించినా, ఎంతటి సంపద సంపాదించినా వాటిని ఆనందించడానికి ఆరోగ్యవంతమైన శరీరం అవసరమని తెలిపారు. అందుకే ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా సాధన చేయడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులను కూడా యోగా చేయడానికి ప్రోత్సహించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది సాధారణంగా శారీరక దృఢత్వానికి అధిక ప్రాధాన్యత ఇస్తారని, కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న యువ పోలీస్ సిబ్బందిని అభినందించారు. యువత తమ శారీరక,మానసిక ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపాలని, ప్రస్తుతం అందరూ మంచి ఫిట్‌నెస్‌తో ఉన్నారని, భవిష్యత్తులో కూడా అదే స్థాయిని కొనసాగించాలని సూచించారు. యోగా ఒక రోజుతో పరిమితం కాకుండా నిత్య జీవితంలో భాగం కావాలని, యోగా దినోత్సవానికే పరిమితం చేయకుండా ప్రతి పదిహేను రోజులకు ఒకసారి శాఖల స్థాయిలో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి సిబ్బందిలో అవగాహన పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. యోగాతో ప్రశాంతమైన మనస్సు, ఆరోగ్యవంతమైన శరీరం లభిస్తాయని, మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి యోగా ఉత్తమ సాధనమని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. నిత్య యోగా సాధన ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండవచ్చని తెలిపారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థకు చెందిన యోగా శిక్షకుల ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్‌తో పాటు అధికారులు, సిబ్బంది యోగా ఆసనాలను అభ్యసించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అఫ్జలోద్దీన్, రామగుండం సీఐ కృష్ణకుమార్, ఆర్ఐలు దామోదర్, మల్లేశం, శేఖర్, రమేష్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ యోగా శిక్షకురాలు రాధిక తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## భైంసాలో ఎస్ఆర్ఆర్ స్కానింగ్ సెంటర్ ప్రారంభం




**చట్టం, భైంసా :** నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో అత్యాధునిక వైద్య పరికరాలతో ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఆర్ స్కానింగ్ సెంటర్ను ఆదివారం ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బి. నారాయణరావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణరావు పటేల్ మాట్లాడుతూ, గతంలో స్కానింగ్ పరీక్షల కోసం వైద్యుల సూచన మేరకు హైదరాబాద్, నిజామాబాద్, నిర్మల్ పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం డాక్టర్ అజయ్ రెడ్డి ఆధ్వర్యంలో భైంసాలోనే అత్యాధునిక పరికరాలతో డయాగ్నస్టిక్ సెంటర్ ఏర్పాటు కావడం నియోజకవర్గ ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. పేద, నిరుపేదలకు స్కానింగ్ పరీక్షలపై ప్రత్యేక ఫీజు రాయితీ కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్ర, శ్యామ్‌రావు పటేల్, మధు పటేల్, ఇతర నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



**చట్టం న్యూస్ లింగంపేట్ :** లింగంపేట్ మండలంలోని మోతె గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త గుంద్రెడ్డి హన్మంత్ రెడ్డి కుమారుడు రంజిత్ రెడ్డి హఠాన్మరణం చెందగ సమాచారం తెలిసిన వెంటనే ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు జాజాల సురేందర్ గ్రామానికి చేరుకుని, రంజిత్ జిత్ రెడ్డి అంత్యక్రియల్లో ఆయన పాల్గొన్నారు. కుమారుడిని కోల్పోయి శోకసంద్రంలో ఉన్న తల్లిదండ్రులను పరామర్శించి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. మాజీ ఎమ్మెల్యే వెంట మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు ఉన్నారు.

## యూరియా యాప్ ను తొలగించాలి బిఆర్ఎస్ పార్టీ నాయకుల డిమాండ్



**చట్టం పోతంగల్ /కోటగిరి :** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో గంగ ప్రసాద్ గౌడ్ ఇంటి ఆవరణలో బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాక అధ్యక్షులు కేటీఆర్ ఆదేశాల మేరకు పత్రికేయుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు తెల్ల రవికుమార్ మాట్లాడుతూ రైతులు యాపుల ద్వారా ఆన్లైన్ వేసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు. చదువురాని రైతులు స్మార్ట్ ఫోన్లు లేక ఇబ్బంది పడుతున్నారు ఏ పరిధిలో యూరియా నిలువలు ఉన్నాయో తెలియక శతమాతమవుతున్నరని ఎద్దేవా చేశారు. 10 సంవత్సరంలో కెసిఆర్ ప్రభుత్వంలో రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా పంటలు అధికంగా పండించి రైతులు సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు. కరోనా కాలంలో కూడా రైతులు చాలా సంతోషంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలు అయినా రాష్ట్ర ప్రజలు కరువు కష్టకాలంలో బతుకుతున్నారని ఎద్దేవా చేశారు. యూరియా యాప్ తక్షణమే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. బిజెపి పార్టీకి కేంద్రంలో ప్రతిపక్షంగా ఉండాలి తప్ప వారికి మద్దతుగా ఉండకూడదని అన్నారు. తెలంగాణ రైతాంగానికి మద్దతుగా ఉండి యూరియా యాప్ ను తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెల్ల రవికుమార్ మోరే కిషన్, బోట్ట గజేందర్, గంగ ప్రసాద్ గౌడ్, శంకర్ గౌడ్, నజీర్, సమీర్, పాల గంగారం, కన్నం సాయిలు, కప్ప సంతోష్, సందీప్, అస్కుల గంగారం తదితరులు పాల్గొన్నారు.

## 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా కార్యక్రమం




**చట్టం పోతంగల్ /కోటగిరి :** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా పోతంగల్ గ్రామంలో ఆదివారం యోగా కార్యక్రమం నిర్వహించారు. యోగ ఇన్‌స్ట్రక్టర్ సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యోగాసనాలు, ధ్యానం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయుష్ వైద్యుడు జయప్రకాష్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగను భాగం చేసుకోవాలని సూచించారు. యోగ వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో యోగ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు, ధ్యాన సాధన చేశారు. ఈ కార్యక్రమంలో యోగ ఇన్‌స్ట్రక్టర్ సతీష్ గౌడ్, జ్యోతి, ఆశా కార్యకర్తలు శారద, సునీత, రేష్మ, లింగమ్మ, అనిత, గ్రామ పెద్దలు హనుమాన్లు కల్లూరి, దిలీప్ సేట్, శేఖర్ సేట్, శేఖర్, దేవయ్య, యువకులు పాల్గొన్నారు.

## హరీశ్ రావు పర్యటన ఏర్పాట్లపై మున్సిపల్ కమిషనర్‌కు వినతి

**ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి కోరిన మాజీ ఎమ్మెల్యే తాటి**



**చట్టం అశ్వారావుపేట :** అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ఆదివారం మున్సిపల్ కమిషనర్ దిలీప్ రెడ్డిని కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేత తన్నీరు హరీశ్ రావు ఈ నెల 23న అశ్వారావుపేటలో నిర్వహించనున్న పర్యటనకు సంబంధించి పట్టణంలో ఫ్లెక్సీల ఏర్పాటు కోసం అనుమతి మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసేందుకు హరీశ్ రావు అశ్వారావుపేటకు రానున్నట్లు తెలిపారు. పర్యటనను విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు కొల్లి రవికిరణ్, డాక్టర్ భూక్యా ఉదయ జ్యోతి, డాక్టర్ భూక్యా ప్రసాద్, సత్యవరపు సంపూర్ణ, శెట్టిపల్లి రఘురామ్, అఖిల్, గంగాధర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్లకు గౌరవ వేతనం ఇవ్వాలి : చలో హైదరాబాద్‌కు పిలుపు

**చట్టం – కొల్చారం :** మెదక్ జిల్లా ఉప సర్పంచ్ల సమావేశం మెదక్ పట్టణంలోని సాయి బాలాజీ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు హాజరై ఉప సర్పంచ్ల సమస్యలు, హక్కులపై చర్చించారు. అనంతరం మెదక్ జిల్లా ఉప సర్పంచ్ల ఫోరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న "చలో హైదరాబాద్" ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉప సర్పంచ్లకు నెలకు రూ.5,000 గౌరవ వేతనం, వార్డు సభ్యులకు రూ.3,000 గౌరవ వేతనం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఉప సర్పంచ్లకు తగిన హోదా, అధికారాలు, గౌరవం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కొల్చారం మండలం నుంచి శ్రీనివాస్, ఆరే రవీందర్, నిర్మల, నాగరాజు, శివ సుధాకర్తో పాటు పలువురు ఉప సర్పంచ్లు పాల్గొన్నారు.




## తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో జయశంకర్‌కు ఘన నివాళి



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్ పేరు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలంగాణ ఉద్యమకారుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. జయశంకర్ వర్ధంతి సందర్భంగా సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన అంశాన్ని దాదాపు ఐదు దశాబ్దాల పాటు తన భుజాలపై మోసుకుంటూ ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలం అందించిన వ్యక్తి జయశంకర్ అని కొనియాడారు. మూడు దశల్లో సాగిన తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తూ, తన రచనలు, ఉపన్యాసాల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారని పేర్కొన్నారు. జయశంకర్ అందించిన స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసి రాష్ట్ర సాధనకు దారి తీసిందన్నారు. ఆ స్ఫూర్తినే ఆధారంగా చేసుకుని సిద్దిపేట నుంచి ప్రారంభమైన ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి విజయవంతమైందని తెలిపారు. ఉద్యమంలో అమరుల త్యాగాలు, ప్రజల ఐక్యత, ఉద్యమ నాయకత్వం కలిసి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి కారణమయ్యాయని వివరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన చరిత్రలో జయశంకర్ పేరు సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జెఏసీ చైర్మన్ జి. పాపయ్య, టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి. తిరుపతి రెడ్డి, జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు కె. రంగాచార్య, తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా నాయకులు కర్రోళ్ల బాబు, ఖమ్మంపల్లి యాదగిరి, పెద్ది రాజు, సీనియర్ జర్నలిస్టు కూతురు రాజిరెడ్డి, మంజీరా రచయితల సంఘం కార్యదర్శి సిద్దెంకి యాదగిరి, తెలంగాణ రచయితల సంఘం ప్రతినిధులు కొండి మల్లారెడ్డి, మహమూద్ పాషా, టీఎన్జీవో సంఘం జిల్లా నాయకులు విక్రమ్ రెడ్డి, శ్రీహరి, అశ్వాక్, రచయితలు డబ్బికారి సురేందర్, రాములు, స్వరూప, విజయ, జర్నలిస్టులు బుచ్చి రాజంరెడ్డి, మైసారెడ్డి, బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

## గుండ్ల సింగారంలో పేదల గుడిసెలను నిర్ధాక్షిణ్యంగా కూల్చి వేయడం పరమ కిరాతకం

- **పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాల్సింది పోయి ఉన్న గుడిసెలనే కూల్చివేస్తారా**
- **ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా?**

**బి కె యం యు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు**

**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :**



హనుమకొండలోని గుండ్ల సింగారంలో నిరుపేదల గుడిసెలను కూల్చివేసి నేలమట్టం చేయడాన్ని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్రంగా ఖండించారు. శనివారం రెవెన్యూ ,మున్సిపల్ సిబ్బంది పోలీసులతో గుండ్ల సింగారంలోని పేదలు కొన్ని యేండ్లుగా నివాసముంటున్న గుడిసె వాసులను భయభ్రాంతులకు గురిచేసి గుడిసెలను తొలగించడం అత్యంత దుర్మార్గమన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని కూలీనాలీ చేసుకుని జీవించే నిరుపేదల గుడిసెలను ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండ గుడిసెలను కూల్చడం అడ్డుకున్న సిపిఐ నాయకులను కార్యకర్తలను అరెస్టు చేయడం ప్రభుత్వ దమన నీతికి నిదర్శంగా ఉందన్నారు. ఇల్లు లేని పేదలందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చి పక్కాగా ఇందిరమ్మ గృహాలు నిర్మిస్తామని ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను తుంగలో తొక్కి, ఇల్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తుంటే పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే బదులు ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి అప్పులు చేసి కట్టుకున్న గుడిసెల నేలమట్టం చేసి పేదలకు నిలువ నీడ లేకుండ చేయడం న్యాయమా, ఇందిరమ్మ రాజ్యం అంటే ఇలానే ఉంటుందా అని ప్రశ్నించారు. బడా బాబులు ఎంతో విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటుంటే స్పందించని ప్రభుత్వ అధికారులు పేదలు గుడిసెల కోసం 50 గజాల స్థలంలో ఇల్లు కట్టుకుంటే కూల్చివేయడం దారుణమన్నారు. మహిళలు చిన్నపిల్లలు వృద్ధులు అని చూడకుండ మానవత్వాన్ని మరిచి వారిని నెట్టు వేస్తూ బలవంతంగా గుడిసెలను నేల మట్టం చేయడంతో బియ్యము పప్పులు సామాన్లు, వంట పాత్రలు బట్టలు, పిల్లల పుస్తకాలు నేలమట్టమైన గుడిసెల కిందనే పోవడంతో వారు పడుతున్న బాధలు వర్ణాణాతీతమన్నారు. ఆ మధ్యన ఖమ్మంలో పేదల ఇండ్లను నేలమట్టం చేసిన సంఘటన మరువక ముందే హనుమకొండలో పేదల గుడిసెలను నేలమట్టం చేయడం చూస్తే ప్రభుత్వ విధానం ఇదేనా అని ప్రశ్నించారు. ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్య వాదులందరు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ముక్త కంఠంతో ఖండించాలన్నారు. ప్రభుత్వం వెంటనే నిరుపేద గుడిసె వాసులకు ప్రత్యామ్నాయ వసతి కల్పించాలని, నష్టపోయిన గుడిసె వాసులకు నష్ట పరిహారం చెల్లించాలని, ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేయాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడకుంటే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

## ఆయాల నియామకాలకు సవరించిన నోటిఫికేషన్

**జనగామ, చట్టం:** సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 2026 27 విద్యా సంవత్సరానికి 39 సభ్యత్వ స్థానిక సంస్థల పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విభాగాల కోసం ప్రీ ప్రైమరీ ఇన్స్పెక్టర్లు, ఆయాల నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ సమగ్ర శిక్ష చైర్మన్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా అర్హులైన అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మొత్తం 78 పోస్టులు 39 ఇన్స్పెక్టర్లు, 39 ఆయాలు తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. దరఖాస్తులను జూన్ 22 నుంచి జూలై 3 సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సమర్పించాలి, ఇప్పటికే దరఖాస్తు చేసిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, పూర్తి వివరాలు సంబంధిత పాఠశాలలు మండల విద్యాశాఖ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని కలెక్టర్ తెలిపారు.

## ఆయిల్ ఫామ్ రైతుల అభ్యున్నతికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి అభినందనీయం: ఎమ్మెల్యే జారే ఆదినారాయణ




**చట్టం అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మల్కారం గ్రామపంచాయతీ పరిధిలోని గుత్తావారిగూడెం గ్రామంలో దమ్మపేట మండల ఆయిల్ ఫామ్ రైతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరుకాగా, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయిల్ ఫామ్ రైతులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఆయిల్ ఫామ్ సాగు ద్వారా రైతులు లాభసాటి దిగుబడులు సాధించి ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అభినందించారు. సాగు విస్తరణ, గిట్టుబాటు ధరలు, మార్కెటింగ్ సౌకర్యాల కల్పన, రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగు అభివృద్ధికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేష కృషి చేస్తున్నారని అన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఆధునిక సాగు పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ఆయిల్ ఫామ్ రైతులు పాల్గొన్నారు.

## బసవలింగ అవధూత అభినందన గ్రంథానికి వ్యాసాల ఆహ్వానం



**చట్టం నారాయణఖేడ్ :** జహీరాబాద్ తాలూకాలోని మల్లయ్యగిరి, బసవకళ్యాణ ఆశ్రమాల పీఠాధిపతి డా. బసవలింగ అవధూత 50వ జన్మదిన మహోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక అభినందన గ్రంథాన్ని ప్రచురించేందుకు శిష్యబృందం నిర్ణయించింది. ఈ గ్రంథానికి ప్రముఖ సాహితీవేత్త డా. బసవరాజ్ బల్లూర్ సంపాదకత్వం వహించనున్నారు. గత రెండు దశాబ్దాలుగా కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వేలాది మందికి సన్మార్గాన్ని చూపిస్తున్న డా. బసవలింగ అవధూత ప్రవచనాలు ధార్మిక చైతన్యం, దేశభక్తి, మానవీయ విలువలను పెంపొందించడంలో విశేష పాత్ర పోషించాయి. కాశీ, శ్రీశైలం, హిమాలయాలు సహా దేశంలోని అనేక పుణ్యక్షేత్రాల్లో లోకకల్యాణం కోసం కఠోర అనుష్ఠానాలు నిర్వహించారు. ధ్యానదీక్షలు, మంత్రదీక్షలు, ఆధ్యాత్మిక బోధనల ద్వారా అనేక కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకువచ్చారు. యువతలో దురలవాట్ల నిర్మూలన, సనాతన ధర్మ ప్రచారం, తల్లిదండ్రుల పట్ల గౌరవ భావన పెంపొందించడంలో విశేష సేవలు అందించారు. ఈ సందర్భంగా ప్రచురించనున్న అభినందన గ్రంథం కోసం సాహితీవేత్తలు, రచయితలు, భక్తులు, శిష్యులు, అభిమానులు తమ వ్యాసాలు, అనుభవాలు, కవితలు, సందేశాలను పంపాలని నిర్వాహకులు కోరారు. వ్యాసాల పంపిణీకి జులై 15ను చివరి తేదీగా నిర్ణయించారు. ఈ విషయాన్ని సతీష్ పాటిల్ ఒక ప్రకటనలో వెల్లడిస్తూ, డా. బసవలింగ అవధూత సేవలను భావితరాలకు పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ అభినందన గ్రంథాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. అవధూత జీవితం, సాధనలపై అవగాహన ఉన్న సాహితీవేత్తలు, రచయితలు, శిష్యులు తమ వ్యాసాలను యూనికోడ్‌లో టైప్ చేసి ssatishkumar121@gmail.com ఇమెయిల్ చిరునామాకు పంపవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు 8247533862, 6305290187 నంబర్లలో సతీష్ పాటిల్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## ముస్తాబాద్‌లో నార్కోటిక్ డాగ్స్‌తో ఆకస్మిక తనిఖీలు

**మాదకద్రవ్యాలపై పోలీసుల ప్రత్యేక నిఘా**




**చట్టం ముస్తాబాద్ :** మాదకద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో పోలీసులు విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిరాణా దుకాణాలు, పాన్ షాపులు, బస్టాండ్లు, హాస్టళ్లు, పాఠశాలలు, కళాశాలల్లో నార్కోటిక్ డాగ్స్ సహాయంతో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎస్సై జ్యోతి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టే లక్ష్యంతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి ప్రజలు సహకరించాలని ఎస్సై జ్యోతి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.

## బస్వాపూర్ గ్రామంలో భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలు

**గ్రామదేవతలను దర్శించుకున్న ఆవుల రాజిరెడ్డి**

**చట్టం వెల్దుర్తి:** వెల్దుర్తి మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో గ్రామ దేవతల మొదటి వార్షికోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు సాయంత్రం మహిళలు పట్టు వస్త్రాలు ధరించి బెల్లం పాలు పెరుగు వేసిన బోనం కుండలను పసుపు కుంకుమతో అలంకరించి డప్పు చప్పుళ్ళ మధ్య శివసత్తుల పూనకాలు పోతరాజుల విన్యాసాలు గ్రామంలో చిన్న పెద్ద తారతమ్యం లేకుండా సందడి వాతావరణం లో పురవీధుల గుండా ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి నైవేద్యం తో పాటు చీర గాజులు పసుమ కుంకుమ సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి గ్రామ దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామదేవతల ఆశీస్సులతో వర్షాలు కురిసి గ్రామంలో పంటలు సమృద్ధిగా పండి గ్రామస్తుల కష్టాలు తొలగి సుఖ సంతోషాలతో జీవించాలని దేవతామూర్తులను వేడుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు హనుమన్న గారి నరేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మహేష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, తలారి మల్లేష్, కిష్టా గౌడ్, పోతిరెడ్డి, మల్లేశం చారి, బొడ్డు సింహం, గోమారం శేఖర్, పులబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చట్టం సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక
CHATTAM NEWS
నిజామాబాద్
సోమవారం
22.06.2026


# ప్రపంచానికి భారతదేశం అందించిన అమూల్యమైన ఆరోగ్య సంపద యోగా






- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి
- అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్

**చట్టం/హనుమకొండ**

ప్రపంచానికి భారతదేశం అందించిన అమూల్యమైన ఆరోగ్య సంపద యోగా అని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 సందర్భంగా ఆదివారం ఉదయం హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యోగ నిపుణుల సమక్షంలో ఆసనాలు, ప్రాణాయామం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అత్యంత విలువైన ప్రాచీన వారసత్వమని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానానికి ప్రతీకగా నిలిచిన యోగా నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది జీవితాల్లో భాగమైందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో యోగాకు లభిస్తున్న ఆదరణ ప్రతి భారతీయుడికి గర్వకారణమన్నారు. ప్రస్తుత జీవనశైలి మార్పుల కారణంగా వెన్నునొప్పి, మెడనొప్పి, మోకాళ్ల నొప్పులు, రక్తపోటు, మధుమేహం వంటి అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి సమస్యలను నివారించడంలో యోగా, ప్రాణాయామం, ధ్యానం కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. యోగా సాధనకు ప్రత్యేక పరికరాలు, ఖరీదైన జిమ్‌లు లేదా పెద్ద ప్రదేశాలు అవసరం లేదని, ఇంట్లోనే కొద్దిపాటి స్థలంలో ప్రతిరోజూ కొంత సమయం కేటాయించి యోగా చేయవచ్చని చెప్పారు. ముఖ్యంగా మహిళలు, కుటుంబ సభ్యులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులకు యోగా, అవసరం ప్రాణాయామం, ధ్యానం ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ, అనులోమవిలోమ, భ్రమరి వంటి ప్రాణాయామాలు ఏకాగ్రతను పెంపొందించడంతో పాటు చదువులో మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా యోగా గురువులు ప్రదర్శించిన వివిధ ఆసనాలు ఆకట్టుకున్నాయి. వయస్సుతో సంబంధం లేకుండా క్రమశిక్షణతో యోగా సాధన చేస్తే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆయుష్ శాఖ, క్రీడా శాఖ, యోగా శిక్షకులు, అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు. యోగాను దినచర్యలో భాగం చేసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎం హెచ్ ఓ డాక్టర్ద్ గ్గా రామ్ కుమార్, డివైఎస్ ఓ ప్రశాంత్, డీపీఆర్ ఓ ఆయూబ్ అలీ, బోద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, విష్ణువర్ధన్, సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ మహేందర్ కుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భాను, డిప్యూటీ నోడల్ అధికారి డాక్టర్ జి రాము, డాక్టర్ శోభారాణి, డాక్టర్ సతీష్, డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ మమతా మాధవి, ఇన్స్పెక్టర్లు ప్రభు చైతన్య, రాజేందర్, వైద్య ఆరోగ్యశాఖ, ఆయుష్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సిబ్బంది, క్రీడాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం రైల్వే ఫ్లైఓవర్‌పై ఘోర ప్రమాదం: మిషన్ భగీరథ ఆపరేటర్ మృతి



**చట్టం రామగుండం :** రామగుండం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో రామగుండానికి చెందిన మాచినేని రమేష్ (32) అనే యువకుడు దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు మరియు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రామగుండం నివాసి అయిన మాచినేని రమేష్ అంతర్గాం మండలం ముర్మూర్ వద్ద గల మిషన్ భగీరథ పంప్ హౌస్‌లో ఆపరేటర్‌గా విధి నిర్వహణలో ఉన్నాడు. ఎప్పటిలాగే తన డ్యూటీ ముగించుకుని మోటార్ సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో, రామగుండం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపైకి రాగానే వెనుక నుండి అతివేగంగా వచ్చిన ఒక ట్రాన్స్‌పోర్ట్ బొలెరో వాహనం రమేష్ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్ తలకు, చేతికి, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 అత్యవసర వాహనంలో అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రమేష్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న రామగుండం సబ్ ఇన్‌స్పెక్టర్ (SI) సంధ్యారాణి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనాన్ని, డ్రైవర్‌ను పోలీసులు పోలీస్ స్టేషన్ కు తరలించి ధర్యాప్తు చేస్తున్నారు.

# ఎన్‌టిపిసి రామగుండం తెలంగాణలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం

**ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగ కార్యక్రమం ఆదర్శంగా నిలిచింది**



**చట్టం రామగుండం :** శారీరక, మానసిక మరియు భావోద్వేగ శ్రేయస్సును సాధించడంలో యోగా ప్రాముఖ్యతను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి మరియు ప్రముఖుల రాకతో కార్యక్రమం ప్రారంభమైంది, అనంతరం లాంఛనప్రాయంగా జ్యోతి ప్రజ్వలన జరిగింది. జీవన విధానంగా యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తూ, భారత ప్రధాన మంత్రి మరియు ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవి శంకర్ గురుదేవ్ అందించిన స్ఫూర్తిదాయక వీడియో సందేశాలను పాల్గొన్నవారు వీక్షించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రాముఖ్యతపై ఒక సంక్షిప్త సమావేశం నిర్వహించబడింది, అనంతరం ఆర్ట్ ఆఫ్ లివింగ్ అధ్యాపక బృందం పరిచయం చేయబడింది. ఒత్తిడి నిర్వహణ నిపుణులు టి. రమణ ప్రసాద్ నిర్వహించిన "ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా" అనే ప్రత్యేక కార్యక్రమం ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. వై. మాధవి, యోగా శిక్షకురాలు. శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిని కాపాడుకోవడానికి అవసరమైన సరళమైన మరియు ప్రభావవంతమైన యోగా పద్ధతులపై ఈ కార్యక్రమం దృష్టి సారించింది. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో తమ వంతు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని మరియు అంతర్గత సమన్వయకర్తలను సన్మానించారు. ముఖ్య అతిథి సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, సంపూర్ణ శ్రేయస్సును మరియు ఉత్పాదకతను పెంపొందించడంలో యోగా పాత్రను నొక్కి వక్కానించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పాటించడం ద్వారా, తమ ఉద్యోగులు మరియు భాగస్వాములలో ఆరోగ్యం, శ్రేయస్సు మరియు సంపూర్ణ అభివృద్ధి సంస్కృతిని పెంపొందించడానికి ఎన్‌టిపిసి రామగుండం & తెలంగాణ కట్టుబడి ఉన్నాయని పునరుద్ఘాటించింది.

# సిద్ధిపేట జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన నీట్2026 పరీక్ష



**చట్టం సిద్ధిపేట ప్రతినిధి :** జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ 2026 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 939 మంది అభ్యర్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 812 మంది హాజరయ్యారు. 127 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి సందర్శించి ఏర్పాట్లు, పరీక్ష నిర్వహణను పరిశీలించారు. ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, నిబంధనలకు అనుగుణంగా పరీక్షను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. రెండు పరీక్ష కేంద్రాల్లో నోడల్ అధికారులు, సీఆర్పీఎఫ్ బలగాలు, పోలీసు సిబ్బంది పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణలో భాగస్వాములైన అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి పరీక్షను విజయవంతంగా పూర్తి చేయడంపై జిల్లా కలెక్టర్ అభినందించారు.

# పరకాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం డా. సిరంగి సంతోష్ కుమార్.. యోగా గురువులకు సన్మానం**



**చట్టం/పరకాల:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం ఉదయం యోగా కార్యక్రమం ఉత్సాహభరితంగా నిర్వహించారు. ప్రముఖ యోగా గురువు కొలుగూరి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యోగా సాధకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర నాయకుడు డా. సిరంగి సంతోష్ కుమార్ మాట్లాడుతూ, నేటి యాంత్రిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడిని అధిగమించేందుకు యోగా ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత కూడా పెరుగుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సమాజంలో యోగా పట్ల అవగాహన కల్పిస్తూ సేవలందిస్తున్న యోగా గురువులు కొలుగూరి రాజేశ్వరరావు, సుంకరి రామన్న, బోగ రఘుపతిలను డా. సిరంగి సంతోష్ కుమార్ శాలువాలతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో బీజేపీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షుడు గాజుల నిరంజన్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్.పీ. జయంతీలాల్, దేవునూరి మేఘనాథ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుక్కల విజయ్ కుమార్, కౌన్సిలర్ ఆకుల లావణ్య శ్రీధర్, పట్టణ ప్రధాన కార్యదర్శులు సంగా పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, మాజీ చైర్మన్ మార్తా రాజభద్రయ్య, నాయకులు దుబాసి కృష్ణ ప్రసాద్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ మెంతుల సురేష్ తదితరులు పాల్గొన్నారు. యోగా కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**చట్టం /పరకాల :** పరకాల పట్టణానికి చెందిన ఇంగిలి రాధాబాయి - రాజేశ్వర్ రావు దంపతుల కుమారుడు, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు ఇంగిలి వీరేష్ రావు మరియు వర్ష వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, నూతన దంపతులు ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వధూవరులను ఆశీర్వదించి వారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# సార్‌కు ఘన నివాళి

**బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో..**

**(చట్టం ప్రతినిధి కామారెడ్డి):** ప్రొఫెసర్ జయశంకర్ 15 వ వర్ధంతి సందర్భంగా ఆదివారం బి ఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు . కామారెడ్డి పట్టణ టిఆర్ఎస్ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయశంకర్ సార్ కుఆదర్శంగా తీసుకొని యువత ముందుకెళ్లాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్ కు చెప్పుల దండ వేయడం ఖాయమన్నారు. ఎన్నో త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ఎంతో కృషి చేశారన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, కాసర్ల స్వామి, క్రిష్ణాజి రావు, నజీరొద్దిన్, మాసుల లక్ష్మినారాయణ, సంగి మోహన్,ఉద్యమ కారులు పడాల జగదీశ్వర్ యాదవు,అనంత రాములు,,BRS నాయకులు,నారాయణ రావు, లింగం యాదవు, ఇలియాస్, క్రిష్ణ యాదవు, నరెందర్, షానూర్, పాల్గొన్నారు.



# కామారెడ్డిలో ఓవర్‌లోడ్ వాహనాలపై రవాణా శాఖ కొరడా



- మంత్రి పొన్నం ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు
- ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులపై చర్యలు
- నిబంధనలు ఉల్లంఘించిన మూడు భారీ వాహనాలు సీజ్: డీటీఓ సంతోష్ కుమార్
- క్వారీ నిర్వాహకులు, వాహన యజమానులకు అధికారుల హెచ్చరిక
- తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతాయి: రవాణా శాఖ



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)**

ఓవర్‌లోడ్‌తో రోడ్లపై ప్రమాదకరంగా తిరుగుతున్న వాహనాలపై కామారెడ్డి జిల్లా రవాణా శాఖ ఉక్కుపాదం మోపింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు చేపట్టింది. జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఉప రవాణా కమిషనర్ దుర్గ ప్రమీల మార్గదర్శకాల ప్రకారం ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. ఈ తనిఖీలలో భాగంగా నిబంధనలను ఉల్లంఘించి పరిమితికి మించి లోడ్‌తో వెళ్తున్న మూడు భారీ వాహనాలను సీజ్ చేసినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి టి.సంతోష్ కుమార్ వెల్లడించారు.

**ఓవర్‌లోడ్ రవాణా చేయవద్దు: డీటీఓ**

క్వారీ నిర్వాహకులు, భారీ వాహనాల యజమానులు ఎవరూ వాహనాలలో ఓవర్‌లోడ్ రవాణా చేయకూడదని డీటీఓ సంతోష్ కుమార్ హెచ్చరించారు. ఓవర్‌లోడ్ వల్ల రోడ్లు దెబ్బతినడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమాల్లో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శంకర్ నారాయణ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు రఫీ, కృష్ణ తేజ, రవాణా శాఖ కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

# 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన తల్లితండ్రులకు ఘన సన్మానం



**చట్టం రామకృష్ణాపూర్:** పట్టణంలోని పలు పాఠశాలలో 10 వ తరగతి చదివి ఇటీవల జరిగిన పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన తన నివాసంలో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులను ఆదివారం ఘనంగా శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతు రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా సన్మానించుకున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తుందని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిలు మహంకాళి శ్రీనివాస్, గోపతి బానేష్, సీనియర్ నాయకులు గోపతి రాజయ్య, చంద్రగిరి ఎల్లయ్య, కౌన్సిలర్ గర్రం శ్రీనివాస్, పార్టీ ప్రధాన కార్యదర్శులు బత్తుల వేణు, ఎల్పుల సత్యనారాయణ, ఎర్రబెల్లి రాజేష్, కార్యదర్శి సాయి, నాయకులు మేకల సురేందర్, కుర్మ సుగుణాకర్, మహిళా నాయకురాలు కోండవేన పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన డాక్టర్ సంతోష్ కుమార్



**చట్టం/పరకాల**

పరకాల పట్టణానికి చెందిన ఇంగిలి రాధాబాయి రాజేశ్వరరావు దంపతుల కుమారుడు ఇంగిలి వీరేష్ రావు, వర్షా వివాహ రిసెప్షన్ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి పరకాల పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు,బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. అలాగే వధూవరుల కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. జయంతీలాల్, మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ కుక్కల విజయ్ కుమార్, కౌన్సిలర్ ఆకుల లావణ్య శ్రీధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సంగా పురుషోత్తం, మాజీ చైర్మన్ మార్తా రాజభద్రయ్య, సంగెం మండల అధ్యక్షుడు చంద్రమౌళి, ముఖ్య నాయకులు కొలనుపాక సిద్ధు, కక్కు రాజు తదితరులు పాల్గొన్నారు.

# జలాల్పూర్ కాళీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**చట్టం - వెల్దుర్తి :** వెల్దుర్తి మండలంలోని జలాల్పూర్ గ్రామంలో ప్రసిద్ధి చెందిన కాళీమాత ఆలయాన్ని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని తన నక్షత్రం పేరుతో ఉన్న మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి వచ్చిన భక్తులు కూడా తమ తమ నక్షత్రాలకు అనుగుణంగా మొక్కలు నాటి వన మహోత్సవంలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రంగీ కృష్ణ, మాజీ జెడ్పీటీసీ రమేష్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు కృష్ణ గౌడ్, ప్రతాప్ రెడ్డి, వెన్నవరం శ్రీనివాస్ రెడ్డి, జగ్గ అశోక్ గౌడ్, శాకారం శ్రీనివాస్ గౌడ్, నెల్లూరు సర్పంచ్ రంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ఇప్పలపల్లిలో ఉచిత వైద్య శిబిరం

**హాజరైన సర్పంచ్ జగన్ రెడ్డి, వైద్యుల బృందం**

**చట్టం శంకరపట్నం :** మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామంలో ఆదివారం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, రక్త పరీక్షల (బ్లడ్ చెకప్) శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జగన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి ఏఏ ఫౌండేషన్ వెల్ఫేర్ & ఛారిటబుల్ ట్రస్ట్, బిఎంహెచ్ఎస్ ఏఏ క్లినిక్ ప్రతినిధులు సహకారం అందించారు. 'ఆరోగ్య సంరక్షణ ద్వారా మానవాళికి సేవ చేయడమే ఆరోగ్యం మా లక్ష్యం' అనే ధ్యేయంతో ఈ ఉచిత శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ మహమ్మద్ ఉస్తాద్ అహ్మద్ , డాక్టర్ ఎండి వాజియోద్దీన్ డాక్టర్ మహమ్మద్ ఇమాదుద్దీన్ ఉమ్మద్‌లు పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి ఉచితంగా రక్త పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ ఉచిత శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ, రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

# ఖేలో ఇండియా కేంద్రంలో యోగా దినోత్సవం

- యోగా ఆరోగ్యకరమైన జీవన విధానానికి పునాది: అదనపు కలెక్టర్ ఎన్.వి. గిరి
- విద్యార్థులు, యువత, క్రీడాకారులతో కలిసి యోగాసనాలు
- శరీరం, మనస్సు, ఆత్మల మధ్య సమతుల్యతే యోగా
- ఒత్తిడిని అధిగమించేందుకు యోగా ఎంతో ఉపయోగం




**(చట్టం ప్రతినిధి కామారెడ్డి):** యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వి. గిరి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం కామారెడ్డి ఖేలో ఇండియా కేంద్రంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**యోగా భారత్ గొప్ప వారసత్వం**

యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వారసత్వమని, ఇది శరీరం, మనస్సు, ఆత్మల మధ్య సమతుల్యతను నెలకొల్పుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. నేటి వేగవంతమైన జీవన విధానంలో ఒత్తిడిని అధిగమించేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

**100 మందితో యోగాసనాలు**

ఈ సందర్భంగా విద్యార్థులు, యువత, క్రీడాకారులు, ఆయుష్ శాఖ సిబ్బందితో కలిసి ఆయన యోగాసనాలు నిర్వహించారు. యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుమారు 100 మంది పాల్గొన్నారు. యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి వివిధ యోగాసనాలను ప్రదర్శించారు. జిల్లా ప్రజలు యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని అదనపు కలెక్టర్ ఎన్.వి. గిరి కోరారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ నోడల్ అధికారి, అదనపు డీఎంహెచ్ఓ డా. వెంకటేశ్వర్లు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాజా గౌడ్, జిల్లా యువజన సేవల సిబ్బంది, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్‌ను స్మరించి... ఘన నివాళులు అర్పించి



**చట్టం రామకృష్ణాపూర్:** భారత రాష్ట్ర సమితి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ 15వ వర్ధంతిని పురస్కరించుకొని జయశంకర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి బిఆర్ఎస్ పట్టణ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కంబగోని సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ తెలంగాణ మలి దశ ఉద్యమం నుండి తెలంగాణ రాష్ట్రం సాధాన వరకు ఎంతో పోరాటం చేశారని గుర్తు చేస్తూ ఆయనను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వెనంక శ్రీనివాస్, బొమ్మ భూమయ్య గౌడ్, జంజిపల్లి శశి కుమార్, కొప్పి రాజశేఖర్, మాజీ సర్పంచ్ జాడి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు పోగుల మల్లయ్య, రెవెల్లి ఓదెలు, బోయినపల్లి అనిల్ రావు, జీలుకర మహేష్ పారిపెల్లి తిరుపతి, పార్టీ సీనియర్ నాయకులు కొండ కుమార్, అలుగుల సత్తయ్య, యూత్ నాయకులు గాజుల చంద్రకిరణ్,రామిడి లక్ష్మి కాంత్,గౌనె రాజేందర్, దబ్బేటి సంతోష్, నస్పూరి శివ, కార్యకర్తలు చిప్పరి సుధాకర్, లద్దురి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి కాంగ్రెస్ లడాయి ఖతం

- వర్గ పోరుకు చెక్.. కామారెడ్డి కాంగ్రెస్‌లో రాజీ: గాంధీభవన్‌లో షబ్బీర్ అలీ, చంద్రశేఖర్ రెడ్డి మధ్య సయోధ్య
- క్రమశిక్షణ కమిటీ ముందు వివాదానికి ఫుల్‌స్టాప్
- ఆడియో టేపులు తనవి కావని షబ్బీర్ అలీ స్పష్టీకరణ
- గత వ్యాఖ్యలపై తదుపరి భేటీలో చర్చిస్తాం: మల్లు రవి
- బహిరంగ విమర్శలు వద్దు, కలిసి పనిచేయండి: కమిటీ ఆదేశం



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి):** కామారెడ్డి కాంగ్రెస్‌లో కొన్ని రోజులుగా కొనసాగుతున్న అంతర్గత కుమ్ములాటకు గాంధీభవన్ వేదికగా ముగింపు పడింది. ఆదివారం క్రమశిక్షణ కమిటీ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పరస్పరం రాజీకి వచ్చారు. గాంధీభవన్‌లో జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం ఇరువురు నేతలు విభేదాలు విడిచిపెట్టి కలిసి పనిచేసేందుకు అంగీకరించారు. ఒకరిపై ఒకరు చేసుకున్న ఆరోపణలకు స్వస్తి పలికి పార్టీ బలోపేతం కోసం శ్రమిస్తామని కమిటీ ఎదుట హామీ ఇచ్చారు.

**వైరల్ ఆడియోపై షబ్బీర్ అలీ క్లారిటీ**

ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయిన వివాదాస్పద ఆడియో టేపులపై షబ్బీర్ అలీ కమిటీకి వివరణ ఇచ్చారు. ఆ ఆడియోలో ఉన్నది తన వాయిస్ కాదని, తనకు దానితో ఎలాంటి సంబంధం లేదని ఆయన తేల్చి చెప్పారు. రాజకీయంగా తనను దెబ్బతీసేందుకు, పరువు తీసేందుకే ప్రత్యర్థులు కావాలని ఆ ఆడియోను క్రియేట్ చేసి ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

**పాత వ్యాఖ్యలపై తర్వాత చర్చ**

షబ్బీర్ అలీ గతంలో చేసిన కొన్ని వివాదాస్పద వ్యాఖ్యల అంశాన్ని వచ్చే సమావేశాల్లో పూర్తిస్థాయిలో చర్చిస్తామని క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి వెల్లడించారు. ప్రస్తుతానికి ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదిరిందని, ముందు పార్టీ ఐక్యత ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు.

**కమిటీ కీలక సూచనలు**

పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరించవద్దని క్రమశిక్షణ కమిటీ ఇద్దరు నేతలకు గట్టిగా సూచించింది. వ్యక్తిగత ఈగోలను పక్కనబెట్టి కాంగ్రెస్ అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని ఆదేశించింది. నియోజకవర్గంలో ఏదైనా సమస్య వస్తే హైకమాండ్ దృష్టికి అంతర్గతంగా తీసుకెళ్లాలని, మీడియా ముందు, బహిరంగ వేదికలపై విమర్శలు చేసుకోవద్దని స్పష్టం చేసింది. స్థానిక వివాదాల కోసం నేతలు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగడం పార్టీ పరువుకు భంగకరమని, ఇకపై ఇలాంటివి పునరావృతం కాకూడదని మల్లు రవి హెచ్చరించారు.

# కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ వన్‌వే ట్రయల్ రన్




**చట్టం హైదరాబాద్ :** నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు అధికారులు కీలక చర్యలు చేపట్టారు. HCITI ప్రాజెక్టు పనుల నేపథ్యంలో కేబీఆర్ పార్క్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం వన్‌వే ట్రాఫిక్ ట్రయల్ రన్‌ను ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ట్రయల్ రన్ అమల్లో ఉండనుంది. కేబీఆర్ పార్క్ మీదుగా స్టడీ సర్కిల్, బసవతారకం ఆస్పత్రి, బీఆర్ఎస్ కార్యాలయం, ఒమేగా ఆస్పత్రి మార్గం నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు వెళ్లే వాహనాలను పోలీసులు రెండు వైపులా ట్రాఫిక్ మళ్లింపులు చేస్తున్నారు. ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎన్ఎఫ్‌సీఎల్ నుంచి జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36, 45 వైపు వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ఎన్‌టీఆర్ భవన్ - బసవతారకం ఆస్పత్రి - విద్యాభవన్ మార్గాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. అలాగే యూసుఫ్‌గూడ, శ్రీనగర్ కాలనీ ప్రాంతాల నుంచి జూబ్లీహిల్స్ వైపు వెళ్లే వాహనాలకు ప్రత్యేక డైవర్షన్లు అమలు చేస్తున్నారు. ఐటీసీ కోహినూర్, కేబుల్ బ్రిడ్జ్ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు రోడ్ నంబర్ 60, 67 మార్గాల ద్వారా జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్‌కు చేరుకోవాలని అధికారులు సూచించారు. ట్రయల్ రన్ సమయంలో ఎక్కడా యూటర్న్‌లకు అనుమతి ఉండదని అధికారులు స్పష్టం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా ఎడమ లేన్ లోనే ప్రయాణించాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలని కోరారు. అలాగే రియల్‌టైమ్ ట్రాఫిక్ పరిస్థితులను తెలుసుకునేందుకు నావిగేషన్ యాప్‌లను వినియోగించాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు వీలైనంత వరకు కార్ పూలింగ్, ప్రజా రవాణా సేవలను ఉపయోగించాలని ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# 12 సంవత్సరాల మోడీ ప్రభుత్వ విశేష సంపర్క్ అభియాన్ నిర్వహణ

**చట్టం – రామగుండం :**




రామగుండం సమీపంలోని అడ్డగుంటపల్లి ఎస్ఎస్ గార్డెన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో "12 సంవత్సరాల మోడీ ప్రభుత్వం - విశేష సంపర్క్ అభియాన్" కార్యక్రమాన్ని నిరాడంబరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకురాలు సోమారపు లావణ్య నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా రామగుండం మున్సిపల్ కార్మికులను శాలువాలు కప్పి, మొమెంటోలు అందజేసి సన్మానించారు. కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాలలో దేశ అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతులు, పేదల సంక్షేమం కోసం అమలు చేసిన పలు పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వ సేవా కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర దళిత మోర్చా ఉపాధ్యక్షులు కాసిపేట శివాజీ, రాష్ట్ర నాయకుడు సోమారపు అరుణకుమార్, మండల అధ్యక్షుడు ఐత పవన్‌తో పాటు కొమ్మ శ్రీనివాస్, ఇదునూరి మల్లేష్, చుక్కలు రాములు, పంగా రవి, జనగాం శివరామకృష్ణ, కంపల్లి రఘు, పాశం రాజు, నరేష్ గౌడ్, సప్పు నాగరాజు, తాళ్లపల్లి శ్రీనివాస్, రాజకుమార్, మహేందర్, మాతంగి కాలనీ బీజేపీ నాయకుడు నరేందర్ పాల్గొన్నారు. అలాగే వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయుడు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు, విద్యారత్న అవార్డు గ్రహీత గొల్ల అంజన్ కుమార్, అనుదీప్ ట్రస్ట్ ఎన్జీవో చైర్‌పర్సన్ అట్లూరి శశికళ, గుమ్మడి ఉజ్వల, గవర్నర్ మెడలిస్ట్‌గా గుర్తింపు పొందిన సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రతినిధి, నృత్యాఖని అకాడమీ ప్రతినిధులు, ఇస్కాన్ రామగుండం ఇన్‌చార్జ్ లావణ్య, అడ్వకేట్ ప్రవళికలను సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

# కామారెడ్డి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో యోగా దినోత్సవం




- యోగా సంస్కృతి పెరిగితే నేరాల శాతం తగ్గుతుంది: అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి
- ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాలతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం
- యోగా సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం: పోలీసులకు సూచన
- రోజుకు 30 నిమిషాలు యోగాకు కేటాయించాలి: ఏఎస్పీ పిలుపు

**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)**

జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి పాల్గొని యోగా సాధన చేశారు.

**యోగా భారత్ ప్రపంచానికి ఇచ్చిన గొప్ప కానుక: ఏఎస్పీ**

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప జీవన విధానమని పేర్కొన్నారు. ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందుతాయని, ఒత్తిడి తగ్గి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవడుతుందని తెలిపారు.

**పోలీసులకు యోగా ఎంతో అవసరం**

ప్రస్తుత వేగవంతమైన జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న ఆయన, ముఖ్యంగా పోలీసు సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు యోగా ఎంతో అవసరమని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకుంటే క్రమశిక్షణ, ఆత్మనిగ్రహం, మానసిక సమతుల్యత పెరిగి నేరాల శాతం కూడా తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం 30 నిమిషాలు యోగా సాధనకు కేటాయించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రామన్, ఆర్ఐ నవీన్, ఆర్ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

## పనసపండ్ల మాటున రూ.1.93 కోట్ల గంజాయి రవాణా:

# కామారెడ్డి పోలీసుల భారీ ఆపరేషన్




- ఒడిశా నుంచి నాసిక్‌కు తరలిస్తున్న 387 కిలోల గంజాయి సీజ్
- ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్ట్: ఎస్పీ రాజేష్ చంద్ర
- 'ఆపరేషన్ కవచ్'తో డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం
- జాతీయ రహదారి-44పై దొరికిన అశోక్ లేలాండ్ వాహనం
- గంజాయి కు సహకరిస్తే కఠిన చర్యలు



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)**

పనసపండ్ల ముసుగులో అక్రమంగా తరలిస్తున్న రూ.1.93 కోట్ల విలువైన 387.128 కిలోల గంజాయిని కామారెడ్డి పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ తెలిపిన వివరాల ప్రకారం... జూన్ 20న ఒడిశా నుంచి మహారాష్ట్రలోని నాసిక్‌కు గంజాయి తరలిస్తున్నట్లు దేవున్‌పల్లి పోలీసులకు సమాచారం అందింది. ఎస్పీ ఆదేశాలతో కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్ పర్యవేక్షణలో ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి44పై క్యాసంపల్లి శివారు రాయల్ ధాబా వద్ద తనిఖీల్లో అశోక్ లేలాండ్ బడా దోస్త్ వాహనం అనుమానాస్పదంగా కనిపించింది. వాహనంలో పైభాగంలో చిందరవందరగా పనసపండ్లు ఉంచి, వాటి కింద సంచుల్లో గంజాయిని దాచినట్లు గుర్తించారు.

**అరెస్టైన నిందితులు:**

1. షేక్ కరిముల్లా @ కరీం, 41, నిజామాబాద్ జిల్లా
2. గైని సుభాష్, 35, నిజామాబాద్ జిల్లా
3. షేక్ రహీమ్, 50, నిజామాబాద్ జిల్లా

**స్వాధీనం చేసుకున్నవి:** 387.128 కిలోల గంజాయి విలువ రూ.1,93,56,400, అశోక్ లేలాండ్ వాహనం, 2 మొబైల్ ఫోన్లు, రూ.500 నగదు, పనసపండ్లు.

"యువత భవిష్యత్తే కామారెడ్డి పోలీసుల ధ్యేయం. 'ఆపరేషన్ కవచ్' పేరుతో డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం మోపుతున్నాం. స్మగ్లర్లు రూట్ మార్చినా దొరకాల్సిందే" అని ఎస్పీ రాజేష్ చంద్ర హెచ్చరించారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందన్నారు. గంజాయి అక్రమ రవాణా ముఠాను పట్టుకున్న కామారెడ్డి డీఎస్పీ మధుసూధన్, రూరల్ సీఐ శ్రీధర్, దేవనపల్లి ఎస్ఐ రంజిత్, బీబీపేట్ ఎస్ఐ విజయ్, పిట్లం ఎస్ఐ అంజనేయులు, మాచారెడ్డి ఎస్ఐ అనిల్, సదాశివనగర్ ఎస్ఐ పుష్పరాజ్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. మాదకద్రవ్యాల సమాచారం ఉంటే డయల్ 100 లేదా దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు తెలపాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ కోరారు.

# నకిలీ పత్రాలతో భూమి అమ్మకానికి యత్నం – నార్సింగిలో ముఠాలు అరెస్ట్



**రాజేంద్రనగర్, చట్టం:** నకిలీ ఆస్తి పత్రాలతో విలువైన భూమిని విక్రయించేందుకు ప్రయత్నించిన ముఠాను నార్సింగి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం, కోకాపేట్‌కు చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు మేరకు నార్సింగి గ్రామంలోని బృందావన్ కాలనీలో ఉన్న భూమిని కొందరు వ్యక్తులు నకిలీ పత్రాల ఆధారంగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిసింది. దీంతో నార్సింగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి నకిలీ సేల్ డీడ్‌తో పాటు ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తప్పుడు పత్రాల ద్వారా భూములపై తమకే యాజమాన్య హక్కులు ఉన్నట్లు చూపించి కొనుగోలుదారులను మోసం చేయాలని యత్నించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. అరెస్ట్ చేసిన వారిలో మాకినేని శివ శంకర ప్రసాద్ (74), కమ్మెల శ్రీనివాసరావు (58), నల్లం ఆదినారాయణ (60), మజ్జి నరేష్ (43) ఉన్నారు. ఈ కేసులో మరో నిందితుడు పరారీలో ఉండగా, అతడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అరెస్టైన నిందితులను కోర్టులో హాజరుపరచగా, వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించబడింది. స్వాధీనం చేసుకున్న పత్రాలపై సాంకేతిక, న్యాయపరమైన ధృవీకరణ కొనసాగుతోంది. ఇలాంటి మోసాలకు గురికాకుండా ఆస్తుల కొనుగోలు సమయంలో ప్రభుత్వ రికార్డులు, రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్ శాఖల ద్వారా పత్రాలను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

# ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి: వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘన నివాళులు



**రాజేంద్రనగర్, చట్టం:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాడిన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కె. జయశంకర్ వర్ధంతి సందర్భంగా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణం ఈ సందర్భంగా స్మరణాత్మక వాతావరణంతో నిండిపోయింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని జయశంకర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ ఆవిర్భావం కోసం జయశంకర్ చేసిన త్యాగాలు, కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గం యువతకు ఆదర్శమని తెలిపారు. అలాగే జయశంకర్ ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని, రాష్ట్ర అభివృద్ధికి ఆయన ఆలోచనలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయన జీవిత విశేషాలను గుర్తు చేసుకుంటూ ఆయనకు గౌరవ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.సి.హెచ్ విద్యాసాగర్‌తో పాటు విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయశంకర్‌కు ఘన నివాళులు అర్పించారు.

# ఐబీఎస్‌లో 14 రోజుల యోగా శిబిరం విజయవంతం

**చేవెళ్ల, చట్టం:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీఎఫ్ఏఐ బిజినెస్ స్కూల్ ( ఐబిఎస్), ఐఫ్ హెచ్‌ఈ విద్యార్థి కార్యకలాపాల విభాగం ఆధ్వర్యంలో 'యోగ సంగమ్' పేరుతో యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరై యోగా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం సాధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఐబీఎస్ ఫిట్‌నెస్ మరియు స్పోర్ట్స్ క్లబ్ టీమ్ వీఏపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించగా, క్లబ్ మెంటర్ ప్రొఫెసర్ శ్వేతా సింగ్, యోగా నిపుణురాలు ప్రొఫెసర్ అనిత ఆచార్య, విద్యార్థి కార్యకలాపాల సమన్వయకర్త ప్రొఫెసర్ మాధవి గరికపర్తి మార్గనిర్దేశనం చేశారు. మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం ఎంబీఏ విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని ఉత్సాహాన్ని ప్రదర్శించారు. వివిధ విద్యార్థి క్లబ్‌ల సభ్యులు సమష్టిగా పాల్గొనడం ద్వారా సంస్థలో ఐక్యత ప్రతిఫలించింది. కార్యక్రమంలో భాగంగా యోగాంత సంస్థకు చెందిన ధృవీకృత యోగా శిక్షకులు విద్యార్థులకు యోగా ఆసనాలు, ప్రాణాయామ పద్ధతులు, ధ్యాన సాధనలను బోధించారు. ముఖ్యంగా విద్యార్థుల ఒత్తిడిని తగ్గించడం, ఏకాగ్రత పెంపొందించడం, శారీరకమానసిక సమతుల్యత సాధించడం పై దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ చేపట్టిన 'యోగ సంగమ్' కార్యక్రమంలో భాగంగా యోగా దినోత్సవానికి ముందు 14 రోజులపాటు నిర్వహించిన యోగా శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరం ద్వారా యోగా ప్రాముఖ్యతపై విద్యార్థుల్లో అవగాహన పెరిగింది. కార్యక్రమం ముగింపు సందర్భంగా ప్రొఫెసర్ మాధవి గరికపర్తి మాట్లాడుతూ, కార్యక్రమం విజయవంతానికి సహకరించిన యాజమాన్యం, అధ్యాపకులు, శిక్షకులు, విద్యార్థులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. చివరగా పాల్గొన్న వారందరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా మార్చుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.




Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell :9948884497. prasadsirigada27@gmail.com